ఈనాడు ఏలూరు
బుధవారం అక్టోబరు 16, 2024
5

విద్యార్థులకు వీరగాథల పోటీలు
ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు
6లో
ఏడు పదుల వయసులో పండగలా వ్యవసాయం
రైతేరాజు కథనాలు

## 'మీ కోసం' వినతుల పరిష్కారానికి ప్రాధాన్యం



ఫిర్యాదుదారు అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** 'మీ కోసం'లో అందే వినతులకు ప్రాధాన్యమిస్తూ, త్వరితగతిన పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ- మీ కోసం' కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి అర్జీలు సమర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మీ కోసంలో మొత్తం 81 వినతులు అందాయన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఫిర్యాదుదారు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని సూచించారు. ● తన భర్త మద్యానికి బానిసై వేధిస్తున్నాడని కామవరపుకోట మండలం తడికలపూడికి చెందిన దొడ్డి శివనాగమల్లేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. ● ప్రగడవరంలోని తన భూమిని మల్లయ్యగూడేనికి చెందిన కొందరు ఆక్రమించారని చింతలపూడి మండలం కాంచనగూడెంవాసి బోయిన అక్కమ్మ ఫిర్యాదు చేశారు. అధికారులు విచారణ చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నాదెండ్ల



**ఈనాడు డిజిటల్, ఏలూరు:** ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల మంత్రి నాదెండ్ల మనోహర్‌ను నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతంలో శాసనసభా స్పీకరుగా వ్యవహరించిన అనుభవం ఉంది. జిల్లాలోని వనరులను ఉపయోగించుకుని పర్యాటకంగా అభివృద్ధి చేయడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. మురుగునీటి పారుదల వ్యవస్థను మరింత అభివృద్ధి చేస్తామని ఆయన వివరించారు.

## రూ.కోట్లు మింగారు.. గోతులు మిగిల్చారు

పట్టణదారుల్లో ప్రయాణం నరకం

పరిశీలన

న్యూస్‌టుడే పురపాలక బృందం

జిల్లాలోని పట్టణాల్లో రహదారులు ఛిద్రమయ్యాయి. సాధారణ ఎన్నికలు దృష్టిలో ఉంచుకుని రూ.కోట్లు వెచ్చించిన వైకాపా ఈ ఏడాది ఆరంభంలో హడావుడిగా వేయించిన రహదారి పనుల్లో నాణ్యత లేకుండా పోయింది.



నూజివీడు పెద్ద గాంధీ బొమ్మ కూడలి నుంచి తిరువూరు వెళ్లే ప్రధాన రహదారి ఇది. వైకాపా అధికారంలోకి వచ్చాక రూ.70 లక్షలతో అభివృద్ధి చేశారు. తర్వాత గుంతలు ఏర్పడ్డా పట్టించుకోలేదు. అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సమయంలో రూ.2 లక్షలతో మరమ్మతులు చేసి మమ అనిపించారు. వర్షాలకు ప్రధాన రహదారి పొడవునా గుంతలేర్పడ్డాయి. ఎన్నికలకు ముందు నామమాత్రపు పనులతో వదిలేశారని వాహన చోదకుడు చిన్నం బుజ్జి అన్నారు.

వర్షాకాలం ముగియక ముందే తారు కరిగింది. గుంతలుగా ప్రారంభమై రహదారుల పొడవునా చిన్నపాటి తటాకాలుగా మారాయి. ముందు చూపులేకుండా వెళ్తే ప్రమాదం తప్పడంలేదని వాహన చోదకులు వాపోతున్నారు. పట్టణాల్లో రహదారుల అభివృద్ధి పేరిట రూ.కోట్లు బిల్లులు చూపారు. పనుల్లో నాణ్యత లేకపోవడంతో ప్రజలకు పాట్లు తప్పడంలేదు.

### కొన్ని ప్రాంతాలపై చిన్నచూపు

నగర పంచాయతీలుగా ఆకివీడు, చింతలపూడి వర్గోన్నతి పొందినా అభివృద్ధి జాడలు లేవు. ఇక్కడ రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడంతో ప్రయాణికులకు నరకం తప్పడంలేదు.



చింతలపూడి నగర పంచాయతీలో గత అయిదేళ్ల వైకాపా పాలనలో రహదారుల అభివృద్ధి విస్మరించారు ఫలితంగా బైపాస్‌రోడ్డు, రత్న థియేటర్ తదితర చోట్ల భారీగా గుంతలున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక స్థానిక ప్రజాప్రతినిధులు, దాతల సహకారంతో మరమ్మతులు జరిగాయి.



ఏలూరు జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ పేట ప్రధాన రహదారిని రూ.20 లక్షలతో అభివృద్ధి చేశారు. అక్కడ ఇప్పుడు ఉన్న గుంతల్లో వాహనం చక్రం పడితే ప్రయాణికుల నడుం జారేట్టుగా ఉంది

### నాణ్యతా లోపం

అయిదేళ్లకు ముందు తారుతో అభివృద్ధి చేసిన రహదారులు కొన్నేళ్లపాటు మరమ్మతులకు గురయ్యేవి కావు. ఎక్కడైనా గుంతలుంటే చతురస్రంగా తవ్వి అందులో తారు వేసి కంకరతో పటిష్ఠపరిచేవారు. వైకాపా అధికారంలోకి వచ్చాక గాలేస్తే ఎగిరిపోయే రాళ్లను వేశారు. పట్టణాల్లో రహదారుల అభివృద్ధికి ఏటా రూ.3 కోట్లు నుంచి రూ.9 కోట్లు ఖర్చు చేసినా కొన్ని నెలలకు అదే రహదారుల్లో ఏర్పడిన గుంతలకు మరమ్మతులంటూ మళ్లీ రూ.లక్షలు మింగారు. వర్షాలతో దెబ్బతిన్న రహదారులన్నింటినీ సాధారణ నిధులతో అభివృద్ధి చేయాలని సూచించాం. గుంతలు ఉన్నచోట్ల తక్షణం మరమ్మతులు చేయాలని స్థానిక అధికారులకు చెప్పాం' అని పురపాలక ఆర్డీ నాగనరసింహారావు తెలిపారు.

## నేటి నుంచి కొత్త మద్యం దుకాణాలు

ఏలూరు డిపోలో సరకు సిద్ధం

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి నూతన పాలసీకి అనుగుణంగా మద్యం దుకాణాలను ప్రారంభించనున్నారు. దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులందరూ ఆయా ప్రాంతాల్లో అనువుగా ఉన్న చోట్ల ఏర్పాటు చేసుకునే పనిలో ఉన్నారు. మంగళవారం రాత్రితో ప్రభుత్వ మద్యం దుకాణాలకు గడువు ముగియటంతో దుకాణంలో ఉన్న సరకు అంతా ఆయా ఎక్సైజ్ పోలీసు స్టేషన్ల పరిధిలోని సీఐలు స్వాధీనం చేసుకోనున్నారు. రెండుమూడు రోజుల్లో డిపోలకు తరలించనున్నారు.

### అన్నీ పరిశీలించాకే అసలైన లైసెన్సులు

ప్రస్తుతం లాటరీలో జిల్లా వ్యాప్తంగా 144 దుకాణాలను దక్కించుకున్న వారందరికీ మంగళవారం ప్రొవిజినల్ లైసెన్సులు జారీ చేశారు. వాటి కాలపరిమితి వారం మాత్రమే ఉంటుంది. దుకాణదారులు నిబంధనలు కచ్చితంగా పాటిస్తున్నారా లేదా ఏమైనా మార్పులు చేర్పులు చేయాలా అనేవి ఎక్సైజ్ అధికారులు స్వయంగా పరిశీలించాక అన్నీ సరిగా ఉంటేనే 22న శాశ్వత లైసెన్సులు జారీ చేస్తారు. ఏలూరు ఐఎంఎల్ డిపోలో సరకు సిద్ధంగా ఉంది. కొత్త దుకాణాల ఏర్పాటుకు కొంత వెసులుబాటు కావాలని కోరిన వారికి కొద్ది రోజులు అవకాశం ఇస్తాం. అన్నీ సవ్యంగా ఉన్నాయో లేదో చూసుకుని అసలైన లైసెన్సులు జారీ చేస్తాం' అని ఎక్సైజ్ డీసీ బి.శ్రీలత తెలిపారు.




### పాటించాల్సిన నిబంధనలు ఇవీ

● గుడులు, బడులు, దేవాలయాల సమీపంలో దుకాణాలు ఏర్పాటు చేయకూడదు. కనీసం 100 మీటర్ల దూరంలో ఉండాలి. ● జాతీయ రహదారికి దగ్గరగా ఉన్న గ్రామాల్లో 20 వేల కంటే తక్కువగా జనాభా ఉంటే ఆ రోడ్డుకు 220 మీటర్ల దూరంలో ఏర్పాటు చేయాలి. 20 వేలకు మించి జనాభా ఉంటే 500 మీటర్ల దూరంలో ఉండాలి. ● మద్యం దుకాణాల వద్ద తాగేందుకు అనుమతి లేదు. ● ఒక వ్యక్తికి 3 సీసాలను మాత్రమే అమ్మాలి. ● ప్రభుత్వం నిర్దేశించిన ఎంఆర్‌పీకే విక్రయించాలి.

## తేజోమయ రూపం.. చంద్రప్రభ వాహనం!

వల్మీకంలో శ్రీనివాసుడిగా ద్వారకాధీశుడి దర్శనం





చంద్రప్రభ వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం



కొలువైన స్వామివారు

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ద్వారకాధీశుడు.. శ్రీదేవి, భూదేవి సమేతంగా చంద్రప్రభ వాహనంపై విహరించారు. తొలుత ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి.. హారతిచ్చి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు నీరాజనాలు పలికారు. ఉదయం సూర్యప్రభ వాహనంపై జరగాల్సిన స్వామివారి గ్రామోత్సవం వర్షం కారణంగా రద్దయ్యింది. రోజుకో విశేష అలంకారంలో భక్తులను కనువిందు చేస్తున్న స్వామివారు మంగళవారం వల్మీకంలో శ్రీనివాసుడి అలంకారంలో దర్శనమిచ్చారు. ● కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఏడు గంటలకు హనుమద్వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం. రాత్రి ఏడు గంటలకు ఎదుర్కోలు ఉత్సవం. 8.30 గంటలకు వెండి శేషవాహనంపై గ్రామోత్సవం ఉంటాయి.

## పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయిద్దాం


**పెదవేగి, న్యూస్‌టుడే:** ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో... డిగ్రీ పూర్తి చేసిన వారిని ఓటర్లుగా నమోదు చేయించాల్సిన బాధ్యత ఎన్డీయే శ్రేణులు తీసుకోవాలని ఎమ్మెల్సీ చిరంజీవిరావు కోరారు. స్థానిక లక్ష్మీపురంలోని ఏఎంసీ ప్రాంగణంలో నాయకులు, కార్యకర్తలతో మంగళవారం సమావేశమయ్యారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ... సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత వస్తున్న తొలి ఎన్నికలు కావడంతో, అందరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పేరాబత్తుల రాజశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు

## అన్నీ ఖాళీయే

● భర్తీకి నోచని జూనియర్ కళాశాలల పీడీ పోస్టులు
● క్రీడాశిక్షణకు దూరంగా పేద విద్యార్థులు



**కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** విద్యార్థి దశ నుంచే ఆరోగ్యంగా ఉండాలంటే ఆటలు బాగా ఆడాలంటారు. వ్యాయామం చేయాలని చెబుతారు. శారీరక దృఢత్వమే కాదు మానసిక ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయంటారు. కానీ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మాత్రం ఆటలు ఆడాలంటే నేర్పే నాథుడే లేకుండా పోయారు.

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వ్యాయామ అధ్యాపకుల పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఇవి భర్తీకి నోచుకోవడం లేదు. పాఠశాల స్థాయి, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో రాణించినప్పటికీ అదే ఒరవడిని ఇంటర్‌లోనూ కొనసాగించాలన్న పేద విద్యార్థుల ఆశలు అడియాసలవుతున్నాయి. క్రీడా కోటాలో ఉద్యోగం సాధించి స్థిరపడాలన్న ఆకాంక్షకు అడ్డుకట్ట పడుతోందన్న ఆవేదన వారిలో నెలకొంది. కనీసం ఒప్పంద ప్రాతిపదికనైనా వ్యాయామ అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

### వారికి న్యాయం చేయాలి

'ప్రభుత్వ కళాశాలల్లో చేరేవారంతా పేద, దిగువ మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులే. ఎటువంటి శిక్షణ లేకుండానే వారంతా పలు పోటీల్లో పాల్గొంటూ పరాజయాలు చవిచూస్తున్నారు. ప్రతిభ గల పేద విద్యార్థులకు న్యాయం చేయాలి'అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ డిమాండ్ చేశారు. 'పాఠశాల స్థాయి నుంచే క్రీడా శిక్షణ కొనసాగాలి. తద్వారా ప్రతిభ కలిగిన ఎందరో క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. రాష్ట్రానికి దేశానికి పేరు తెస్తారు' అని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ, అధ్యాపక సంఘం మాజీ అధ్యక్షుడు డి.రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

### విజ్ఞప్తి చేశాం

'వ్యాయామ అధ్యాపక (పీడీ) పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం. గతంలో పదోన్నతుల ద్వారా భర్తీ చేసేవారు. ఇప్పుడైతే ఏపీపీఎస్సీ ద్వారా నేరుగా నియామకాలు జరపాల్సిన పరిస్థితి ఉంది. ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి'అని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ప్రభాకరరావు తెలిపారు.

| జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు | మంజూరైన వ్యాయామ అధ్యాపక పోస్టులు | భర్తీ | విద్యార్థులు మొదటి ఏడాది | విద్యార్థులు రెండో |
|---|---|---|---|---|
| 19 | 14 | 0 | 2400 | 1700 |


## ఆకలి తీర్చడంలో అక్షయపాత్ర!

నేడు ఆహార దినోత్సవం

ఉమ్మడి పశ్చిమ గోదావరిని అన్నపూర్ణగా అభివర్ణిస్తుంటారు. దేశంలోని మొత్తం వరి సాగులో 20 శాతం పశ్చిమలోని మార్టేరు వరి పరిశోధన కేంద్రం నుంచి వెళ్లిన విత్తనాలదే.

☛ పండ్లు కూరగాయలు కలిపి ఉమ్మడి జిల్లాలో ఏటా 2.50 లక్షల టన్నుల దిగుబడి వస్తోంది.

**పాలకొల్లు, న్యూస్‌టుడే:** వరి ఉత్పత్తుల్లో దేశంలోనే రాష్ట్రం మొదటి మూడు స్థానాల్లో కొనసాగుతుండగా ఉమ్మడి జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉంది. కొబ్బరి, అరటి, మామిడి, ఆక్వా, కూరగాయలు తదితర ఆహార ఉత్పత్తుల్లోనూ మేటిగా నిలుస్తూ అన్నం గిన్నెగా ప్రసిద్ధమైంది.




### నిత్యం ఎగుమతులు

ఉమ్మడి జిల్లాలో 5 లక్షల ఎకరాలకు పైబడి వరి సాగవుతుండగా ఒక్క రబీలోనే 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతోంది. రాష్ట్రంలో ధాన్యం పండించే తూర్పుగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలతో పోల్చి చూస్తే ఉమ్మడి జిల్లాదే మొదటి స్థానం. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు నిత్యం గూడ్సు రైళ్లలో ఎగుమతులు జరుగుతుంటాయి.

### కమ్మని కొబ్బరి

ఉమ్మడి జిల్లాలో పండించే కొబ్బరికి ఇతర రాష్ట్రాల్లో గిరాకీ ఉంది. మొత్తం మీద 56 వేల ఎకరాల్లో సాగవుతున్న కొబ్బరి పంట రాష్ట్రంలోనే మూడో స్థానంలో ఉందంటే పంట ప్రత్యేకత తెలుస్తుంది. ఒక్క పశ్చిమలోనే 11.29 లక్షల కాయలు దిగుబడి వస్తుంది. ఇక్కడి నుంచి మహారాష్ట్ర, నాగపూర్, రాజస్థాన్ ప్రాంతాలకు నిత్యం 50 లారీలకు పైగా ఎగుమతులవుతున్నాయి.

### ఆక్వా హవా

ఆక్వాసాగులోనూ అద్భుతమైన ఫలితాలతో ఉమ్మడి జిల్లా దూసుకుపోతోంది. మొత్తం రాష్ట్ర ఆదాయం రూ.50 వేల కోట్లలో ఉమ్మడి జిల్లా టర్నోవర్ రూ.18 వేల కోట్లకు పైబడి ఉందంటే జిల్లా రొయ్య ఏ విధంగా మీసం మెలేస్తుందో తెలుసుకోవచ్చు. ఉమ్మడి జిల్లా ఉత్పత్తులు ఎక్కువగా ఐరోపా దేశాలకు ఎగుమతవుతున్నాయి.

### ఫలవంతం

ఉమ్మడి జిల్లాలో పండించే ఆయిల్‌పామ్ ఎగుమతులు బాగున్నాయి. 2 లక్షల ఎకరాల్లో వచ్చే ఉత్పత్తులతో ఏలూరు జిల్లా మొదటి స్థానంలో కొనసాగుతుంది. మామిడిలోనూ మనం ముందంజలోనే ఉన్నాం. నూజివీడు మామిడికి దేశవిదేశాల్లో మంచి గిరాకీ ఉంది. ఏటా వేసవి సీజన్‌లో 5 నుంచి 10 టన్నుల వరకు నూజివీడు మామిడి పండ్లను దుబాయ్, సింగపూర్, దక్షిణకొరియా, మాల్దీవులకు ఎగుమతులవుతుంటాయి. నిమ్మ, జీడిమామిడి ఉత్పత్తుల్లో మొదటి మూడు, నాలుగు స్థానాలు ఉమ్మడి జిల్లా కైవసం చేసుకుంది. అరటి, కూరగాయల సాగులోనూ మంచి ఉత్పత్తులతో జిల్లా ప్రగతి బాటలో పయనిస్తోంది.

## సాగు తీరు పరిశీలించాం.. ఇక ఆచరిస్తాం

జిల్లాలో గుజరాత్ ప్రతినిధుల బృందం పర్యటన

**ఏలూరు గ్రామీణ, పెదవేగి- న్యూస్‌టుడే:** గుజరాత్‌లోని వివిధ సంస్థల ప్రతినిధుల బృందం మంగళవారం జిల్లాలో పర్యటించింది. ఏలూరు గ్రామీణం, పెదవేగి మండలాల్లోని వెంకటాపురం, అమ్మపాలెం, లక్ష్మీపురంలో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించింది. వెంకటాపురంలో రైతు సాధికార సంస్థ ప్రదర్శించిన సార్వత్రిక సూత్రాల వీలు, వరి కాంపాక్ట్ బ్లాక్‌ను తిలకించారు. ఏ గ్రేడ్ వరి పొలాన్ని సందర్శించి, రైతులతో మాట్లాడారు. సాగు ఆదాయ, వ్యయాలు తెలుసుకున్నారు. అమ్మపాలెంలో కొటారు రంగయ్య, లక్ష్మీపురంలో చక్రపాణి సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. వాటి ఉపయోగాలు, జీవ వైవిధ్యంపై ఆరా తీశారు. ఆధునిక సాంకేతిక పద్ధతులు ఆచరిస్తున్న రైతులను వారు అభినందించారు. ద్వారకాతిరుమల మండలం గుండుగొలను గుంటలోని గోపాలకృష్ణ ఎస్పీఎం దుకాణంలో కషాయాలు, జీవ ఉత్ప్రేరకాల తయారీలను పరిశీలించారు. జిల్లాలోని రైతుల అనుభవాలు, వారి సలహాలు, సూచనలు తెలుసుకోవడం ఆనందంగా ఉందని గుజరాత్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ విధానాలను తమ రాష్ట్రంలోనూ ఆచరించేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.



ఒకే చోట వివిధ రకాల పంటల సాగు తీరును పరిశీలిస్తున్న ప్రతినిధులు

## పోలీసుశాఖ వెబ్‌సైట్ ప్రారంభం



వెబ్‌సైట్ గోడపత్రికను ఆవిష్కరించిన ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తదితరులు

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** జిల్లా పోలీసు శాఖ అధికారిక వెబ్‌సైట్‌ను మంగళవారం తన కార్యాలయంలో ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ప్రారంభించారు. ఆ వెబ్‌సైట్ వివరాలతో పొందుపరిచిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏలూరుపోలీస్.ఏపీ.గవ్.ఇన్ వెబ్‌సైట్‌లో మహిళల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ మోసాల వివరాలు, నివారణ మార్గాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, నూజివీడు డీఎస్పీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





## పైవంతెన నిర్మాణానికి అడుగులు



కైకరంలో పైవంతెన నిర్మించే ప్రాంతం

**కైకరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే:** కైకరం వద్ద జాతీయ రహదారిపై పైవంతెన నిర్మాణానికి నేషనల్ హైవే అథారిటీ వడివడిగా అడుగులు వేస్తోంది. పైవంతెన నిర్మాణంపై నిర్వాసితులు కోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం ఇటీవల నేషనల్ హైవే అథారిటీకి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో భూసేకరణ పనులు ప్రారంభించారు. నేషనల్ హైవే అథారిటీ, రెవెన్యూ అధికారులు సర్వే చేసి మార్కింగ్ వేశారు.

కైకరంలోని కూరకారం రెస్టారెంట్ నుంచి బీసీ కాలనీ వరకు సుమారు 1.790 కిలోమీటరు పొడవున పైవంతెన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.70 కోట్లు మంజూరు చేసింది. పైవంతెన నిర్మాణానికి 2022 సెప్టెంబరు 22న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రాజమహేంద్రవరం నుంచి భూమి పూజ చేశారు.

### కోర్టును ఆశ్రయించిన నిర్వాసితులు

గతంలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తమ ఆస్తులు పోగొట్టుకున్నామని, పైవంతెన నిర్మాణంతో రెండోసారి కూడా తమ భూములు ఇస్తే అన్ని విధాలా నష్టపోతామని నిర్వాసితులు కోర్టును ఆశ్రయించారు. గుండుగొలను-కొవ్వూరు జాతీయ రహదారి అందుబాటులోకి వచ్చాక 216ఏ జాతీయ రహదారిపై వాహన రాకపోకలు తగ్గాయని, పైవంతెన అవసరం ఉండదని కోర్టుకి వివరించారు. పైవంతెన నిర్మాణం చేపడితే 2022 లెక్కల ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని విన్నవించారు. దీంతో కోర్టు స్టే ఇచ్చింది.

**కొన్నేళ్లపాటు వాదనలు..** నేషనల్ హైవే అథారిటీ కౌంటర్ దాఖలు చేయడంతో ఇరువురి మధ్య కొన్నేళ్లపాటు వాదనలు జరిగాయి. 3డీ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం 60 మీటర్ల మేర భూసేకరణ చేపట్టాలని కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొందని హైవే అథారిటీ ప్రత్యేక ఉప తహసీల్దారు ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు.

**పైవంతెన ఎందుకు?..** 216ఏ జాతీయ రహదారి మీదుగా భారీ వాహనాలు, లారీలు వాహనాలు వేగంగా ప్రయాణించడంతో తరచూ ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పైవంతెన నిర్మించడంతో ప్రమాదాలు తగ్గుముఖం పట్టడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడదు.

**కోల్పోయేవి ఇవే..** 2018లో వేసిన మార్కింగ్ చెరిగిపోవడం, భూయజమానులు మారడంతో రెవెన్యూ దస్త్రాల ప్రకారం మళ్లీ సర్వే చేసి మార్కింగ్ వేశారు. 61 సర్వే నంబర్లలోని సుమారు 21,395 చదరపు మీటర్ల భూమి అవసరం. ఎస్సీ బాలుర వసతి గృహం, జడ్పీ ఉన్నత పాఠశాల (కొంతభాగం), పలు దుకాణాలు, భవనాలు, పొలాలు పైవంతెన నిర్మాణంతో కనుమరుగు కానున్నాయి.

## సమస్యలు పరిష్కరిస్తాం


సంక్షేమాధికారిణితో మాట్లాడుతున్న రత్నప్రసాద్

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** స్థానిక శిశు గృహం, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న వసతి, భోజన సదుపాయం, వసతి గృహాల పరిశుభ్రత, తాగునీరు, వైద్యం, రక్షణ తదితరాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల పరిసరాలను మరింత శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. స్థానికంగా ఎవరైనా ఇబ్బందులుంటే, ఉన్నతాధికారుల దృష్టికి తేవాలన్నారు. విద్యార్థినులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. డీసీపీవో సూర్యచక్రవేణి, వసతి గృహాల సంక్షేమాధికారిణులు వెంకటేశ్వరమ్మ, రాధాదేవి, సర్వమంగళ, న్యాయవాది కోనే సునీత తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణ

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** ఐటీడీఏ కేఆర్‌పురం పరిధిలోని ఏజెన్సీ మండలాల్లో మెగా డీఎస్సీకి సన్నద్ధమవుతున్న గిరిజన యువతకు సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యాన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ ఇన్‌ఛార్జి పీవో, జేసీ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. ఈ నెల 21లోపు జ్ఞానభూమి పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. దరఖాస్తుల పరిశీలనానంతరం అర్హత పరీక్ష నిర్వహిస్తామని, ఉత్తీర్ణులైన వారికి ఉచిత వసతి, భోజనం కల్పించి శిక్షణనిస్తామని ఆమె మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## రేపు జిల్లా స్థాయి యువజనోత్సవాలు

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** నగరంలోని గవరవరం సి.హెచ్.ఎస్.డి.సెయింట్ థెరిసా మహిళా కళాశాలలో ఏపీ ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యాన గురువారం జిల్లా స్థాయి యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సెట్‌వెల్ సీఈవో కె.ఎస్.ప్రభాకరరావు తెలిపారు. ఇన్నోవేషన్ ఇన్ సైన్స్, టెక్నాలజీ, జానపద నృత్యం, కవిత్వం, కథలు రాయడం, చిత్రలేఖనం, ఉపన్యాసం తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## యోగా పోటీలకు ఎంపిక

**ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే:** స్థానిక ఇండోర్ స్టేడియం మైదానంలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యాన అండర్-14, 17 విభాగాల్లో ఉమ్మడి జిల్లా స్థాయి యోగా బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్-14 విభాగంలో 11 మంది, అండర్-17 విభాగంలో 12 మంది చొప్పున బాలబాలికలను ఎంపికయ్యారు. వీరు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని కార్యనిర్వాహక కార్యదర్శి అలివేలు మంగ తెలిపారు.

## కొనసాగుతున్న 'టెట్'

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** ఏలూరు సమీప సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాల కేంద్రంలో 'ఉపాధ్యాయ అర్హత పరీక్షలు'(టెట్) కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు మొత్తం 372 మంది అభ్యర్థులకు 324 మంది మాత్రమే హాజరయ్యారు.

## హాజరు తక్కువ ఉంటే వివరణ ఇవ్వాలి: డీఈవో

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** విద్యార్థుల హాజరు 50 శాతం కంటే తక్కువ ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికొచ్చి వివరణ ఇవ్వాలని డీఈవో ఎస్.అబ్రహం మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. దీన్ని ఏపీ ఉపాధ్యాయ సమాఖ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర ఆక్షేపించారు. విద్యార్థులను పాఠశాలలను పంపాల్సిన బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. ఉపాధ్యాయులు ఆధార్ నవీకరణ, అపార్ నంబర్ల కేటాయింపునకు ఇంటర్నెట్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువులను బోధనేతర పనులకు వినియోగించడం దారుణమని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# విద్యార్థులకు వీరగాథల పోటీలు

- దేశభక్తి అంశాలే ప్రాతిపదిక
- 17 నుంచి జిల్లా స్థాయి పోటీలు




**కొయ్యలగూడెం గ్రామీణ, భీమవరం పట్టణం, న్యూస్‌టుడే**

ఝాన్సీ లక్ష్మీబాయి కలలోకి వచ్చి దేశసేవ చేయమని చెబితే ఎలా స్పందిస్తారు?.. 1857 తిరుగుబాటులో పాల్గొన్న ఓ వీరుడు గురించి చెప్పమంటే ఎవరి గురించి చెబుతారు? స్వాతంత్ర్య పోరాటంలో నీకు స్ఫూర్తిని కలిగించిన దేశభక్తుడు గురించి వివరించమంటే.. విద్యార్థులు ఏం చెబుతారు ఇవన్నీ.. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తోన్న వీర్‌గాథ 4.0 పోటీల్లోని అంశాలు.

ప్రభుత్వం మూడేళ్లుగా ఆయా పోటీలు నిర్వహిస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయి విజేతలకు సత్కారం, ప్రశంసాపత్రం, జాతీయ స్థాయి విజేతలకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.10వేలు ఇస్తారు. ఈ పర్యాయం పాఠశాల స్థాయి పోటీలు మంగళవారంతో ముగిశాయి.

### సీబీఎస్ఈ పాఠశాలల వారు మినహా..

సీబీఎస్ఈ పాఠశాలలు మినహా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అందరూ అర్హులే. 3-5 తరగతుల విభాగంలో పద్యం, 150 పదాలకు మించని కథ, చిత్రలేఖనం, 6-8 తరగతులకు 300 పదాల కథ, 9-10 తరగతులకు 700 పదాల వ్యాసరచన, 11-12 తరగతులకు వెయ్యి పదాల వ్యాస రచనతో పాటు, చివరి మూడు విభాగాలకు పద్యాలు, చిత్రలేఖనం, ఒకటి, రెండు నిమిషాల నిడివితో వీడియో(మల్టీమీడియా) ప్రదర్శన పోటీలు జరుగుతాయి. దేశభక్తితో కూడిన చరిత్ర ఆధారంగా పోటీల్లో పాల్గొనాల్సి ఉంది.

**విద్యార్థుల వివరాలు**

| పాఠశాలలు | ఏలూరు | పశ్చిమగోదావరి |
|---|---|---|
| ప్రాథమిక | 64748 | 54070 |
| ప్రాథమికోన్నత | 40548 | 30672 |
| ఉన్నత | 162145 | 148184 |

### ఏయే స్థాయిల్లో ఎప్పుడెప్పుడంటే..

జిల్లా స్థాయిలో 17 నుంచి నవంబరు 10, రాష్ట్రస్థాయిలో నవంబరు 12 నుంచి 30, జాతీయ స్థాయిలో డిసెంబరు 4 నుంచి 24 తేదీల మధ్య పోటీలు ఉంటాయి.


### పోటీల ప్రస్థానం ఇలా..

ప్రతి పాఠశాలలోనూ నాలుగు విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన నలుగురిని వీర్‌గాథ 4.0 పోర్టల్లో నమోదు చేయాలి. పాఠశాల స్థాయిలో ఎంపికైన వారు జిల్లా స్థాయికి అక్కడ విజేతలైన నలుగురిని రాష్ట్రస్థాయికి, ప్రతిభ చూపిన ఎనిమిది మందిని జాతీయ స్థాయికి పంపుతారు. అక్కడ ఒక్కో విభాగం నుంచి 25 మంది వంతున 100 మంది విజేతలను ఎంపిక చేస్తారు.

### ప్రోత్సహించాలి

'అన్ని పాఠశాలల యాజమాన్యాలు తమ విద్యార్థులను పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలి. దేశభక్తుల చరిత్రలు, స్ఫూర్తి ప్రదాతల కథలు తెలుసుకునేందుకు వీర్‌గాథ 4.0 పోటీలు చక్కని అవకాశం. విజేతల వివరాలను పోర్టల్‌లో పొందుపర్చాలి'అని ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల విద్యాధికారులు ఎస్.అబ్రహాం, నాగమణి సూచించారు.

## మొక్క తొడిగిన మోడు



నరసాపురం గ్రామీణ మండలం చినమైనవానిలంకలోని తాటిచెట్టు మోడుపై రావిమొక్క మొలిచింది. సాధారణంగా బతికున్న చెట్ల బెరడుల్లో మొక్కలు మొలవడం తెలిసిందే. పూర్తిగా మోడువారి ఒరిగిపోయిన తాటిచెట్టు కాండంపై మొక్క పెరుగుతుండడంతో ఆ మార్గంలో వెళ్లేవారంతా ఆసక్తిగా చూస్తున్నారు.

-ఈనాడు, నరసాపురం

## స.హ.చట్టం బలోపేతానికి కృషి

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** సామాన్యుల చేతిలో సమాచార హక్కు చట్టం బ్రహ్మాస్త్రమని.. దాన్ని బలోపేతం చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని స.హ.చట్టం జాతీయ అధ్యక్షుడు కమ్మ శివరామకృష్ణ పిలుపునిచ్చారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శివరామకృష్ణ తదితరులు

స్థానిక కెనాల్ రోడ్డులోని ఓ సమావేశ మందిరంలో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు బెజవాడ దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించారు. గత వైకాపా ప్రభుత్వం స.హ.చట్టాన్ని నిర్వీర్యం చేసిందని ధ్వజమెత్తారు. కమిషనర్లుగా విశ్రాంత న్యాయమూర్తులను నియమించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చందన్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు కడియాల విజయలక్ష్మి, నరసింహారావు, బీవీఆర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఉచిత ఇసుక విధానం : కలెక్టర్

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** ప్రజల అవసరాలకు తగ్గట్టుగా ఇసుక సరఫరా చేస్తున్నామని కలెక్టర్ వెట్రిసెల్వి రాష్ట్ర గనులశాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనాకు తెలిపారు. తవ్వకాల టెండర్ల ప్రక్రియ, జిల్లా ఇసుక కమిటీలో ఆమోదించడం, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై గనుల శాఖ కమిషనర్, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లతో మంగళవారం వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డిమాండ్‌కు తగ్గట్టు ఇసుక నిల్వలు ఉన్నాయని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉచిత విధానాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నామని వివరించారు. అక్రమ రవాణాకు ఆస్కారం లేకుండా పటిష్ఠ నిఘా పెట్టామని ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి జీపీఎస్ కలిగిన వాహనాల ద్వారా అందిస్తున్నామని చెప్పారు. గనులశాఖ డీడీ బి.రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దుదాం..

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** ఏలూరును ఉల్లాస్ కార్యక్రమం ద్వారా సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక విడిది కార్యాలయంలో 'ఉల్లాస్' అమలుపై మంగళవారం అధికారులతో దూర దృశ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... జిల్లాలోని నిరక్షరాస్యులందరినీ రానున్న మూడేళ్లలో అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికులు, కాపలాదారులు, ఆయాలతో పాటు జిల్లా వ్యాప్తంగా 15 నుంచి 50 ఏళ్లలోపు వయసున్న నిరక్షరాస్యులను మండల స్థాయిలో గుర్తించాలన్నారు. ఈ నెల 16 నుంచి 24 వరకు మండలాల వారీగా వివరాల సేకరించి, అక్షరాస్యత తరగతులు నిర్వహణకు చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. మార్చిలో అభ్యాసకులకు పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.





ద్విచక్రవాహనాన్ని తల్లిదండ్రులకు చూపిద్దామని వెళ్లి..

## లారీ ఢీకొని ఉపాధ్యాయుడి మృతి


గణేష్‌కుమార్ (పాతచిత్రం)

**గోపాలపురం, టి.నరసాపురం, న్యూస్‌టుడే:** ఎంతో కష్టపడి ఇష్టంగా ద్విచక్రవాహనం కొనుగోలు చేశాడు ఆ యువకుడు. ఆ వాహనాన్ని తల్లిదండ్రులకు చూపించి తన ఆనందాన్ని పంచుకుందామనుకున్నాడు. ఈ క్రమంలో తల్లిదండ్రుల వద్దకు వెళ్తున్న సమయంలో లారీ మృత్యువు రూపంలో ఎదురు వచ్చింది. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం గ్రామ శివారులోని అమరావతి కాటా వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కె.గణేష్‌కుమార్(42) మృతి చెందారు. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో భార్య, పాపతో కలిసి నివాసం ఉంటున్నారు. సోమవారం నూతన ద్విచక్రవాహనం కొనుగోలు చేసి, తల్లిదండ్రులకు చూపాలని మంగళవారం ఉదయం స్వగ్రామమైన ఏలూరు జిల్లా టి.నరసాపురం మండలం బొర్రంపాలెం బయలుదేరి వెళ్లారు. గోపాలపురం గ్రామ శివారుకు వచ్చేసరికి ఖమ్మం వైపు నుంచి వస్తున్న లారీ ఎదురుగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. కొంతదూరం వాహనంతో పాటు మృతుడిని ఈడ్చుకెళ్లిందన్నారు. స్థానికులు వెంటనే స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా ప్రథమ చికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉండటంతో రాజమహేంద్రవరం తరలించారు. అప్పటికే గాయాలైన గణేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై మృతుడి భార్య బేబి ఆదిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు. గణేష్‌కుమార్ మృతితో బొర్రంపాలెంలో విషాదఛాయలు అలముకున్నాయి.



## ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు

**కాకినాడ కలెక్టరేట్:** ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు మంగళవారంతో గడువు ముగిసింది. జులై 29 నుంచి సెప్టెంబరు 3 వరకు అర్హుల నుంచి ఓటు నమోదు దరఖాస్తులు స్వీకరించారు. వీటిపై విచారణ పూర్తి చేసి, సెప్టెంబరు 24న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించారు. దీనిపై అభ్యంతరాల స్వీకరణతో పాటు ఈనెల 15 వరకు మిగిలిపోయిన అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇకపై కొత్తగా తీసుకోరు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులపై ఈనెల 30లోగా విచారణ చేసి, నవంబరు 6న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారు. గతనెల 24 నుంచి ఈనెల 15 వరకు కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఓటు నమోదుకు వచ్చిన దరఖాస్తుల వివరాలు మంగళవారం రాత్రికి కూడా కాకినాడ కలెక్టరేట్‌కు చేరలేదు. బుధవారం నాటికి కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

# ఏడు పదుల వయసులో.. పండగలా వ్యవసాయం

**ఉంగుటూరు, న్యూస్‌టుడే**


రైతు సాగు చేస్తున్న బొప్పాయి తోట

ఏడు పదుల వయసులో బొప్పాయిలో అంతర పంటల సాగు చేసి ఔరా అనిపిస్తున్నారు ఉంగుటూరు మండలం చేబ్రోలుకు చెందిన యర్రా నరసింహారావు. సంప్రదాయానికి భిన్నంగా మారుతున్న కాలానికి అనుగుణంగా స్వల్ప నీటి వినియోగంతో సేంద్రియ పద్ధతుల్లో పంటలు సాగు చేసి లాభాలు గడిస్తున్నారు. అయిదో తరగతి వరకు చదువుకున్న నరసింహారావు 1965 నుంచి వ్యవసాయం చేస్తున్నారు. కొన్నేళ్ల కిందట సేంద్రియ వ్యవసాయ నిపుణుడు పాలేకర్ కాకినాడ, గుంటూరులో నిర్వహించిన శిక్షణ తరగతులకు వెళ్లారు. ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొని చివరకు విజయం సాధించారు. పురుగులు, తెగుళ్ల నివారణకు సొంతంగానే కషాయాలు తయారు చేసుకుంటున్నారు. స్థానికంగా 20 ఎకరాలు కౌలుకు సాగు చేస్తున్నారు. పశువుల ఎరువు, డ్రిప్, మల్చింగ్‌షీటు, దుక్కు, కౌలు మొత్తం కలిపి ఎకరానికి రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. అనంతపురం నుంచి తైవాన్ 786 రకం బొప్పాయి మొక్కలు సాగు చేస్తున్నారు. అందులో అంతర పంటలుగా దేశవాళీ రకాలైన బీర, వంగ, మిర్చి, దోస, బెండ, తోటకూర, గోంగూర, చుక్కకూర, బంతి వేశారు. ఇప్పటి వరకు 25 టన్నుల బొప్పాయి, అయిదు టన్నుల చొప్పున బీర, దోస, టన్ను చొప్పున బంతి, మిర్చి విక్రయించారు. పెట్టుబడి పోను ఎకరానికి రూ.50 వేల వరకు లాభం వచ్చింది.

రైతేరాజు

### సొంతంగానే కషాయాలు

నరసింహారావు సొంతంగానే కషాయాలు తయారు చేసుకుంటున్నారు. పంటలను ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణ, మొక్కల్లో బలం పెంచడంలో ఆయనకు బాగా పట్టు ఉంది. ఘన జీవామృతం, జీవామృతం, పంచగవ్య, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నాస్త్రం, దశపర్ణి కషాయం, పుల్లటి మజ్జిగ, ఆవు పాలు సొంటి స్వయంగా తయారు చేసుకుంటున్నారు. ఉత్తమ రైతు పురస్కారాలు కూడా అందుకున్నారు.

### ప్రణాళికతోనే లాభాలు



అయిదు దశాబ్దాలు పైగా వ్యవసాయం చేస్తున్నా. సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యమైన పంటలు పండిస్తున్నా. సొంతంగానే కషాయాలు తయారు చేసుకుంటున్నా. ప్రణాళికా బద్ధంగా సాగు చేస్తే లాభాలు వస్తాయి. మార్కెటింగ్ సదుపాయం ఉంటే మరింత ఆదాయం సమకూరుతుంది.

**- యర్రా నరసింహారావు, చేబ్రోలు**

## పండు ఈగల పని పడదాం

**పోడూరు, న్యూస్‌టుడే:** జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తీగజాతి కూరగాయ పంటలైన బీర, ఆనప, పొట్ల, కాకర సాగు చేస్తున్నారు. ఈ పంటలకు కొన్ని సందర్భాల్లో పండు ఈగ సమస్యగా మారుతుంది. దీనికి సంబంధించి ఉద్యానశాఖాధికారి కె.ప్రియదర్శిని మాట్లాడుతూ సుమారు 15-30 శాతం మేర పంటకు నష్టాన్ని కలిగిస్తుంది. పండు ఈగ నివారణ, నియంత్రణ చర్యలను పూత మొదలు కాక ముందే మొదలు పెట్టాలి. తల్లి ఈగ కాయలపై లేత దశలో ఉన్నప్పుడు గుడ్లను పెడుతుంది. ఈ గుడ్లు 2 నుంచి 5 రోజుల్లో లార్వాలుగా మారి కాయలోనికి రంధ్రాలు చేసుకుని తినడం ప్రారంభిస్తాయి. ఈ దశలో లార్వా వలన కాయలపై ముదురు గోధుమ రంగు మచ్చలు ఏర్పడి కాయకుళ్లుకు దారితీస్తుంది. పండు ఈగ నియంత్రణకు లింగాకర్షణ బుట్టలను ఎకరానికి 10 నుంచి 12 ఉంచటం వలన మగ ఈగలను నియంత్రించవచ్చు. దీనికి ఇథైల్ ఆల్కాహాల్ 60 మి.లీ., పి.ఎసిటోక్సిఫినైల్ బ్యూటానోన్ 40 మి.లీ., నువాన్ (డైక్లోరివాస్) 20 మి.లీ కలిపి ఈ ద్రావణంలో 5×5×1.2 సెం.మీ చెక్కముక్క లేదంటే మందంగా ఉన్న 2 అంగుళాల కాటన్ తాడు తీసుకుని 24 గంటలు నానబెట్టాలి. లీటరు ఖాళీ ప్లాస్టిక్ సీసాను తీసుకుని దానికి మూడు వైపులా ఒక అంగుళం సైజు రంధ్రాలు చేయాలి. సీసా మూతకు చిన్న రంధ్రం చేసి తయారు చేసుకున్న ఎరను సీసా మధ్యలోకి వచ్చేలా నేలకు కనీసం 3-5 అడుగుల ఎత్తులో వేలాడదీయాలి.


పంటను ఆశించిన పండు ఈగ

### మీరూ అడగొచ్చు

**ప్రశ్న:** మినుములో మరుక మచ్చల పురుగును ఎలా నివారించాలి ?

**- కృష్ణమూర్తి, జంగారెడ్డిగూడెం**

**సమాధానం:** పైరు పూత దశకు రాకముందు నుంచే అప్రమత్తంగా ఉండాలి. పూత దశలో (35 రోజులు) విధిగా పైరుపై 5 శాతం వేపగింజల కషాయం లేదా వేప నూనె 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. దీని వల్ల గుడ్లు పెట్టకుండా నివారించవచ్చు. పిల్ల పురుగులు కనిపించనట్లయితే వెంటనే క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా థయోడికార్బ్ 1 గ్రా. లేదా ఎసిఫేట్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.


డాక్టర్ ఇ.కరుణశ్రీ, ప్రధాన శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం, వెంకట్రామన్నగూడెం
✆ చరవాణి 73826 33692

ఉద్యాన విశ్వవిద్యాలయం న్యూస్‌టుడే

## ఆ సమయంలోనే పంట కోయాలి


కోత కోస్తున్న కూలీలు

**ఆచంట (మార్టేరు), న్యూస్‌టుడే:** 80 నుంచి 90 శాతం వెన్నులు పసుపు రంగులోకి మారుతున్నపుడు మాత్రమే వరి పంట కోత కోయాలని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు టి.శ్రీనివాస్ రైతులకు సూచించారు. వరి పంటను ఏ సమయంలో కోత కోయాలి, ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. గింజలో తేమ శాతం తగ్గించడానికి పనలను రెండు నుంచి మూడు రోజులు చేనుపైనే ఎండనివ్వాలి. ఎక్కువగా ఎండితే మిల్లింగులో కూడా నూక శాతం పెరుగుతుంది. నూర్చేటప్పుడు గింజల్లో 12 నుంచి 13 శాతం తేమ ఉండేలా చూసుకోవాలి. తూర్పారబెట్టడం ద్వారా నూర్చిన వరి నుంచి మట్టి, ఇతర వ్యర్థాలను వేరు చేయాలి. ఇందులో తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. దీనిని 12- 13 శాతం తగ్గించడానికి బాగా ఆరనివ్వాలి.

# ఏలూరు

●ఏలూరు ●దెందులూరు ●ఉంగుటూరు



## ఘనంగా ధ్యాన మందిరం వార్షికోత్సవం

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** తంగెళ్లమూడి సాయినాథ్ నగర్‌లోని శిర్డీ సాయినాథుని ధ్యాన మందిరం వార్షికోత్సవం నేత్రపర్వంగా కొనసాగుతోంది. మంగళవారం ఉదయం బాబాకు పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర పూజలు చేశారు. అనంతరం పల్లకిలో పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు సాయి నామాన్ని జపిస్తూ కీర్తనలు ఆలపించారు. రాత్రి పవళింపు సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సాయిబాబాను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## అప్పనవీడులో అన్నదానం

**అప్పనవీడు(పెదపాడు), న్యూస్‌టుడే:** అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయావరణలో మంగళవారం దాతల తోడ్పాటుతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గుడిపాడుకు చెందిన తమ్ము బాష్కరరావు, వెంకటలక్ష్మి నరసమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారని ఈవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు.

**నిడమర్రు:** పెదనిండ్రకొలను శ్రీదుర్గాపేట రామాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం ఆలయ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. వందలాది మంది భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాలు స్వీకరించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు తూర్పువీధి: 80081 23847 | ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483 | ఉంగుటూరు: 79933 00492

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే**

**సమస్య:** తంగెళ్లమూడిలో మురుగు కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. మురుగు ముందుకెళ్లే అవకాశం లేక రోడ్లపైకి చేరుతోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. **- పవన్, స్థానికుడు**

**సమాధానం:** పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువల్లో పూడిక తీయిస్తాం. **- చంద్రయ్య, నగరపాలక సహాయకారి**

**సమస్య:** అశోక్‌నగర్ పాత ఆంధ్రాబ్యాంకు వీధిలో విద్యుద్దీపాలు సక్రమంగా వెలగడం లేదు. రాత్రివేళ రాకపోకలు సాగించేందుకు వృద్ధులు, పిల్లలు భయపడుతున్నారు. **- వెంకటేశ్వరరావు, స్థానికుడు**

**సమాధానం:** సమస్య నా దృష్టికి రాలేదు. సిబ్బందిని పంపి వీధి దీపాలు బాగు చేయిస్తాం. **- శేషగిరి, విద్యుత్తు ఏఈ**

**ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే**

**సమస్య:** తూర్పువీధి సాయిబాబా గుడి రోడ్డులో వారం రోజులుగా వీధి దీపం వెలగడం లేదు. చీకట్లో పాదచారులు, వాహన చోదకులు రాకపోకలు సాగిస్తున్నారు. **- వి.రామాంజనేయులు, స్థానికుడు**

**సమాధానం:** వీధి దీపాన్ని బాగు చేయిస్తాం. **- కె.శేషగిరి, విద్యుత్తు ఏఈ**

**సమస్య:** ఆముదాల అప్పలస్వామి కాలనీ వినాయక గుడి రోడ్డులో నెల రోజులుగా మురుగు కాలువలను శుభ్రం చేయలేదు. వాడుక నీరు ముందుకెళ్లక, ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. **- జి.రాజారావు, స్థానికుడు**

**సమాధానం:** పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువల్లో పూడిక తీయిస్తాం. **- శివారెడ్డి, నగరపాలక అదనపు అధికారి**

### పూడిక తొలగింపు

స్పందనకు వందనం

**ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే:** అశోక్‌నగర్ బాపూజీ కార్యాలయం వెనుక రోడ్డులోని మురుగు కాలువలను ఎట్టకేలకు శుభ్రం చేశారు. నెల తరబడి కాలువలను శుభ్రం చేయకపోవడంపై 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ఈ నెల 8న ప్రచురితమైన వార్తకు నగరపాలక అధికారి భానుప్రతాప్ స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువలను శుభ్రం చేయించారు.

### కాలువలు పరిశుభ్రం..

ఆముదాల అప్పలస్వామి కాలనీ గాంధీ పార్కు రోడ్డులోని మురుగు కాలువలు ఎట్టకేలకు పరిశుభ్రమయ్యాయి. కాలువల్లో పూడిక తీయకపోవడంపై ఈ నెల 9న వార్త ప్రచురితమైంది. నగరపాలక అదనపు అధికారి శివారెడ్డి స్పందించి, పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువల్లో పూడిక తీయించారు.

### వెలిగిన వీధి దీపం

శనివారపుపేట జడ్పీ పాఠశాల ముందు రోడ్డులో వీధి దీపం వెలిగింది. దీపం మరమ్మతులకు గురవడంపై ఈ నెల 12న ప్రచురితమైన వార్తకు విద్యుత్తు ఏఈ కె.శేషగిరి స్పందించారు. సిబ్బందిని పంపి వీధి దీపాన్ని బాగు చేయించారు.



ఈయన పేరు పర్వతనేని పెద్దయ్య. భీమడోలు మండలం దుద్దేపూడి గ్రామం. గతేడాది ఎకరా పొలంలో సేంద్రియ విధానంలో వరి సాగు చేశారు. సుమారు 32 బస్తాల దిగుబడి వచ్చింది. ఈ ఏడాది అదే ఒరవడి కొనసాగిస్తున్నారు. రసాయనిక ఎరువులు వినియోగిస్తే దిగుబడి కాస్త పెరిగినా.. ఆరోగ్యకర పంటలు పండించాలన్న ఉద్దేశంతో సేంద్రియ పద్ధతిలో వరి సాగు చేస్తున్నానని రైతు చెబుతున్నారు.

చిత్రంలోని రైతు పేరు నీలం శ్రీనివాసరావు. దుద్దేపూడి గ్రామం. ఈ ఏడాది ప్రయోగాత్మకంగా ప్రకృతి వ్యవసాయ విధానంలో వరి సాగు ప్రారంభించారు. చీడపీడల నివారణకు సేంద్రియ కషాయాలు తయారు చేసి వాడుతున్నారు. మారుతున్న కాలానుగుణంగా ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ.. సేంద్రియ పద్ధతిలో వరి పండిస్తున్నట్లు శ్రీనివాసరావు పేర్కొన్నారు.



# పొలంబడి.. నూతన ఒరవడి!

సేంద్రియ సాగు ప్రోత్సాహానికి ప్రభుత్వం అడుగులు

**భీమడోలు, న్యూస్‌టుడే**

వ్యవసాయాధారిత దేశంలో... రైతులు గిట్టుబాటు ధర లభ్యత లేక ఆర్థికంగా నష్టపోతున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకంతో సాగు ఖర్చు విపరీతంగా పెరిగిపోతోంది. దీనికితోడు మితిమీరిన ఎరువులు, మందుల వినియోగంతో.. ఆహార ఉత్పత్తుల్లో రసాయన అవశేషాలు పేరుకుపోయి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది. సాగులో రైతులకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసేందుకు, సేంద్రియ సాగుపై రైతుల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు 'పొలంబడి' నిర్వహిస్తోంది. మండలానికో క్షేత్రం ఎంపిక చేయగా- వ్యవసాయం, దాని అనుబంధ విభాగాల అధికారులు వారానికి రెండు రోజులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. పంటల ఎదుగుదలను పరిశీలించడంతో పాటు రైతులకు సందేహాలు నివృత్తి చేస్తున్నారు.



కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (పాత చిత్రం)

### నాణ్యమైన దిగుబడి..

విత్తనం నుంచి కోత దశ వరకు పురుగు మందులు వాడకుండా నాణ్యమైన పంట దిగుబడి సాధించడమే పొలంబడి ప్రధాన ఉద్దేశం. ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేస్తున్న రైతులు సహజ సిద్ధంగా సేంద్రియ ఎరువులు తయారు చేస్తూ వినియోగిస్తున్నారు. తెగుళ్ల నివారణకు ద్రవ జీవామృతాలు పేరిట స్వయంగా కషాయాలు కలుపుతూ పిచికారీ చేస్తున్నారు. ఈ పద్ధతులు సత్ఫలితాలు ఇస్తుండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 'పొలంబడిలో భాగంగా సురక్షిత, ఆరోగ్యకర పంటలు సాధించేలా రైతులను సేంద్రియ బాట పట్టిస్తున్నాం. ఈ విధానంలో పండించిన ఉత్పత్తులకు 'సేంద్రియ ధ్రువపత్రం' ఇస్తుండటంతో మంచి ధర వస్తోంది' అని భీమడోలు ఏడీఏ సీహెచ్ ఉషా రాజకుమారి తెలిపారు.

## నిబద్ధతతో విధులు నిర్వర్తిద్దాం

**ఉంగుటూరు, న్యూస్‌టుడే:** ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందాలని ఎంపీడీవో రాజ్‌మనోజ్ సూచించారు. స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో ప్రజా సచివాలయ సంక్షేమ సహాయకులతో మంగళవారం సమావేశమై మాట్లాడారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వివిధ సమస్యల పరిష్కారానికి ప్రజలు అందించే వినతులను త్వరితగతిన పరిష్కరించాలని ఆయన ఆదేశించారు.

## అధికారులకు అభినందనలు

**పెదపాడు, న్యూస్‌టుడే:** అప్పనవీడుకు చెందిన పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పలువురు మండల అధికారులను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గరికపాటి నాగేశ్వరరావు నేతృత్వంలో ఎంపీడీవో ఆదినారాయణ, తహసీల్దారు సునీత, ఇన్‌ఛార్జి ఎస్సై కట్టా శారద సరికొత్త పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. గ్రామంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని వారు విజ్ఞప్తి చేశారు.

## యువతకు అబ్దుల్ కలాం స్ఫూర్తి

**ఉంగుటూరు, న్యూస్‌టుడే:** నేటి యువతరానికి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం స్ఫూర్తి ప్రదాత అని ప్రధానోపాధ్యాయుడు నక్కా సుధాకర్ అన్నారు. ఉప్పాకపాడు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం అబ్దుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలాం జీవిత చరిత్రను విద్యార్థులు దృశ్య రూపంలో వీక్షించారు. ఉపాధ్యాయులు అల్లు శ్రీను, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



భీమడోలు: విగ్రహానికి పూలమాల వేస్తున్న సంఘ నాయకులు

**భీమడోలు:** స్థానిక మూడు గుళ్ల కూడలిలోని అబ్దుల్‌కలాం విగ్రహానికి ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పుష్పాంజలి ఘటించారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల, మాధురి జూనియర్ కళాశాలలో కలాం జయంతి వేడుకలు నిర్వహించారు.

**ఏలూరు గ్రామీణ:** స్థానిక ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎన్డీయే నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. దెందులూరులోని బీఆర్డీ నర్సింగ్ కళాశాలలో విద్యార్థులు పుష్పాంజలి ఘటించారు.

## గ్రామాల్లో ప్రగతి వెలుగులు నింపుతాం: ఎమ్మెల్యే

**పెదవేగి, న్యూస్‌టుడే:** గ్రామాల్లో ప్రగతి వెలుగులు నింపడమే లక్ష్యంగా ఎన్డీయే ప్రభుత్వం పల్లె పండగ వారోత్సవాలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. కొప్పులవారిగూడెం, పెదవేగి గ్రామాల్లో మంగళవారం పల్లె పండగ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఆయా అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్సీ వి.చిరంజీవిరావు, ఎంపీడీవో పి.శ్రీనివాస్, జనసేన, తెదేపా నాయకులు ఘంటసాల వెంకటలక్ష్మి, బొప్పన సుధాకర్, కామిరెడ్డి మురళి, ముసునూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సాబ్జీ ఆశయాలు కొనసాగిస్తాం

**గణపవరం, న్యూస్‌టుడే:** దివంగత ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ఆశయాలు కొనసాగిస్తానని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గానికి, ప్రభుత్వానికి వారధిలా పని చేస్తానన్నారు. త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్య ఓటు వేసి తన విజయానికి బాటలేయాలని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయరామరాజు, కార్యదర్శి రత్నరాజు, ఆడిట్ సభ్యుడు రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి గోపీమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న హబీబ్ బాషా

## ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి

**భీమడోలు, న్యూస్‌టుడే:** ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా తెలిపారు. గుండుగొలనులో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది'లో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు ప్రకృతి సేద్యం వైపు మొగ్గుచూపాలని సూచించారు. భూసారం పెంపునకు వన ధాన్యాలు సాగు చేయాలన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి నాణ్యమైన గోనె సంచులు అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు వరి పొలాలను పరిశీలించి, రైతులకు పలు సూచనలిచ్చారు. పశు వైద్యాధికారి హరికృష్ణ, ఏడీఏ ఉషా రాజకుమారి, మండల వ్యవసాయాధికారిణి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

**నిడమర్రు గ్రామీణం:** క్రొవ్విడిలో వ్యవసాయాధికారిణి గీతాదేవి ఆధ్వర్యాన మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పొలాలు పరిశీలించి, రైతులకు సూచనలిచ్చారు. అన్నదాతలకు ప్రభుత్వ రాయితీలపై అవగాహన కల్పించారు. చీడ పీడల నివారణపై సూచనలు, సలహాలు ఇచ్చారు.



దస్త్రాలు పరిశీలిస్తున్న లక్ష్మణరావు

## పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

**ఉంగుటూరు, న్యూస్‌టుడే:** పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని తాడేపల్లిగూడెం ఉప విభాగం మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. ఉంగుటూరులోని ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. కేంద్రంలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాల తీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... కాలానుగుణ వ్యాధులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు.



గుంతలమయంగా శాంతినగర్ ఎన్టీఆర్ విగ్రహం నుంచి కలెక్టర్ బంగ్లా రోడ్డు

# నగరపాలక... గోతులు పూడ్చక!

ఏలూరు నగర పరిసర ప్రాంతాల్లోని రహదారులు అధ్వానంగా మారాయి. ఏ దారి చూసినా అడుగడుగునా గోతులే కనిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత ఛిద్రమయ్యాయి. ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా రాత్రివేళ గోతులను గమనించక.. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు పరిశీలించి రహదారులకు కనీసం మరమ్మతులైన చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- ఈనాడు, ఏలూరు**



అధ్వానంగా గ్జేవియర్‌నగర్ నుంచి శనివారపుపేట మార్గం



ఆశ్రమం కూడలి సమీప ఆటోనగర్‌లో..



బహుమతులు అందుకున్న విద్యార్థినులతో గ్రామ పెద్దలు

## 'వారధి'లో పత్తేపురం బాలికల ప్రతిభ

**నిడమర్రు, న్యూస్‌టుడే:** 'వారధి- 2024' రాష్ట్రస్థాయి వ్యాసరచన ఆన్‌లైన్ పోటీల్లో పత్తేపురం విద్యార్థినులు ప్రతిభ చూపారు. కె.దివ్య, కె.రిషిత, కె.మహిమ సువర్ణరూప ప్రోత్సాహక బహుమతి సాధించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అభినందన సభ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు పీవీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను సన్మానించి, జ్ఞాపికలు ప్రదానం చేశారు. గైడ్ ఉపాధ్యాయుడు కె.సుబ్బరాజును అభినందించారు. సర్పంచి నీలపాల సాయిప్రియ, ఉప సర్పంచి రుద్రరాజు కొండ్రాజు, ఎస్ఎంసీ ఛైర్‌పర్సన్ ఎన్.దేవి, గ్రామ పెద్దలు భీమరాజు, లక్ష్మీపతిరాజు, లక్ష్మీనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల్లో మేధో శక్తి పెంపునకు కృషి

**పెదపాడు, న్యూస్‌టుడే:** విద్యార్థుల్లో మేధో శక్తి పెంపొందించడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో అభ్యసన వైకల్యంపై మంగళవారం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... పిల్లలు చదవడం, రాయడంలో తలెత్తే సమస్యలను డిస్లెక్సియాగా పిలుస్తారన్నారు. సమగ్ర శిక్షా ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఐఈఆర్టీ సిబ్బంది పాల్గొన్నారు.

**భీమడోలు:** విద్యార్థి దశలో కలిగే అభ్యసన నిరోధకాలను అధిగమించడానికి రూపొందించిన నిర్దిష్ట అభ్యసన నైపుణ్యాల(డిస్లెక్సియా) కార్యక్రమాన్ని పాఠశాలల్లో విధిగా అమలు చేయాలని ఎంఈవో భాస్కరకుమార్ సూచించారు. స్థానిక భవిత కేంద్రంలో నిర్దిష్ట అభ్యసన నైపుణ్యాల సాధనపై మంగళవారం ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ... ప్రాథమికంగా కచ్చితమైన, సరళమైన పద పఠనాన్ని అలవాటు చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు అహ్మద్, ముంతాజ్‌వలి, దుర్గ, రత్నకుమారి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## ఆకతాయిలు వేధిస్తే ఫిర్యాదు చేయండి

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** విద్యాలయాలు, ఇళ్ల వద్ద ఎవరైనా ఆకతాయిలు వేధిస్తే 112 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని మహిళా పోలీసుస్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు సూచించారు. ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఆదేశానుసారం స్థానిక రామకోటి వద్దనున్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు మంగళవారం గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల్లోని అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 1930కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. మహిళా స్టేషన్ ఎస్సై క్రాంతిప్రియ, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సందట్లో సడేమియా!

ఎమ్మార్పీ కంటే అధికంగా మద్యం అమ్మకాలు

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి నూతన మద్యం విధానంలో దుకాణాలు నడపనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సందట్లో సడేమియా చందాన... కొందరు సిబ్బంది ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు యథేచ్ఛగా మద్యం అమ్మకాలు చేపట్టారు. జిల్లా కేంద్రం ఏలూరులోని పలు దుకాణాల్లో ఎమ్మార్పీతో పోలిస్తే అదనంగా రూ.10 నుంచి రూ.20 వరకూ నగదు వసూలు చేశారు. ఎక్సైజ్ అధికారులు నూతన మద్యం దుకాణాల ఏర్పాట్లలో తలమునకలై ఉండటంతో... సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరించారు. దీనిపై పలువురు మందుబాబులు పెదవి విరుస్తున్నారు.



మద్యం కొనుగోలు చేస్తున్న మందుబాబులు

## క్రైస్తవుల సమస్యలు పరిష్కరించాలి

**ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే:** నగరంలోని క్రైస్తవుల ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పలువురు పాస్టర్లు విజ్ఞప్తి చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన 'మీ కోసం'లో కలెక్టర్ కె.వెట్రిసెల్విని కలిసి వినతిపత్రం అందజేశారు. క్రైస్తవుల సౌకర్యార్థం శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని కోరారు. 2003లో ఏఎస్ఆర్ స్టేడియం వెనుక నగర క్రైస్తవ సామాజిక భవన నిర్మాణానికి స్థలం కేటాయించారని, భవన ఏర్పాటుకు నిధులు విడుదల చేయాని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌బాబు, వర్కింగ్ అధ్యక్షుడు ఎన్ఎల్‌పాల్, కార్యదర్శి రత్నప్రసాద్, కోశాధికారి జోసెఫ్, పెరికే వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాస్టర్లు

## స్థలం కేటాయించాలని వినతి

**ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే:** నగరంలో అఖిల భారత వివాహ అధ్యక్షుల సంఘం సామాజిక భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఆ సంఘం అధ్యక్షుడు దేవరశెట్టి రంగారావునాయుడు విజ్ఞప్తి చేశారు. నగరంలోని ఓ వేడుక మందిరంలో మంగళవారం సంఘ సమావేశం నిర్వహించి మాట్లాడారు. పెళ్లి సంబంధాలు కుదుర్చే వారిని మ్యారేజ్ బ్రోకర్లుగా సంబోధించకుండా మధ్యవర్తులు లేదా పెద్ద మనుషులుగా పిలవాలని, ఈ మేరకు ప్రభుత్వం జీవో తేవాలని ఆయన కోరారు.

## సమర్థంగా విధుల నిర్వహణ: ఎస్పీ

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** మహిళా పోలీసుస్టేషన్ అధికారులు, సిబ్బంది సమర్థంగా విధులు నిర్వర్తించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఆదేశించారు. స్థానిక మహిళా పోలీసుస్టేషన్‌ను మంగళవారం రాత్రి ఎస్పీ తనిఖీ చేశారు. గదులు, రిసెప్షన్ కేంద్రం, సీసీ కెమెరాల పనితీరు, సీసీ పుటేజీల రికార్డింగ్‌లు పరిశీలించి మాట్లాడారు. పాఠశాల విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహనా కల్పించాలన్నారు. సాయంత్రం వేళ కళాశాలలు వదిలే సమయంలో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో మహిళా పోలీసులతో గస్తీ ఏర్పాటు చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. అనంతరం సీసీఎస్ పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసి... అధికారులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు.



సీసీ కెమెరా పుటేజీలు పరిశీలిస్తున్న ప్రతాప్ శివకిశోర్

## నేరాల నియంత్రణకు చర్యలు

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** నేరాల నియంత్రణలో భాగంగా ఒకటో పట్టణ సీఐ సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి స్థానిక పాత బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం రాత్రి గస్తీ తిరిగారు. బస్టాండ్‌లో ప్రయాణికుల నుంచి దొంగలు నగదు, నగలు దోచేస్తున్న నేపథ్యంలో... సీసీ కెమెరాలను పరిశీలించారు. అలాగే విద్యుత్తు సరఫరా పైనా ఆరా తీశారు. ఆర్టీసీ అధికారులతోనూ మాట్లాడి వివరాలు సేకరించారు. దుకాణ సముదాయాలను పరిశీలించి యజమానులను అప్రమత్తం చేశారు.

## ఏలూరు సినిమాలు

**ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే**

| | |
|---|---|
| అంబిక డీలక్స్ | కమిటీ కుర్రోళ్లు |
| అంబిక మినీ | రామనగర్ బన్నీ |
| సాయిబాలాజీ | మా నాన్న సూపర్ హీరో |
| బాలాజీ | శ్వాగ్ |
| సత్యనారాయణ స్క్రీన్ 1 | విశ్వం |
| సత్యనారాయణ స్క్రీన్ 2 | వేట్టయన్ |
| సత్యనారాయణ స్క్రీన్ 3 | వేట్టయన్ |
| విజయలక్ష్మి వీమ్యాక్స్ 1 | దేవర |
| విజయలక్ష్మి వీమ్యాక్స్ 2 | దక్షిణ |
| విజయలక్ష్మి వీమ్యాక్స్ 3 | జిగ్రా |
| ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1 | వేట్టయన్ |
| ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2 | వేట్టయన్ |
| ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3 | విశ్వం |
| ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4 | విశ్వం |

## కాలువలో దూకి ఆటో డ్రైవర్ ఆత్మహత్య

**గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే:** పోలవరం కుడి కాలువలో దూకి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గన్నవరం మండలం వీరపనేనిగూడెంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ కరీముల్లా(40) ఆటో డ్రైవర్ కాగా.. 20 ఏళ్ల కిందట ఏలూరుకు చెందిన జుబేదాతో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కరీముల్లా మద్యానికి బానిసవడంతో జుబేదా తన ఇద్దరు కుమారులను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయారు. అతడు ప్రస్తుతం తల్లితో కలిసి స్థానికంగా నివసిస్తున్నాడు. గత రాత్రి మద్యం తాగి ఇంటికి రావడంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన కరీముల్లా స్థానిక పోలవరం కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం మృతదేహం లభ్యమవ్వడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆత్కూరు ఎస్సై సురేష్ మంగళవారం తెలిపారు.



షేక్ కరీముల్లా (పాత చిత్రం)

## ముగ్గురిపై కేసు

**పెదవేగి, న్యూస్‌టుడే:** పాత కక్షలను మనసులో పెట్టుకొని ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ముగ్గురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం మేరకు... ముండూరుకు చెందిన బి.చంద్రశేఖర్‌కు అదే గ్రామానికి చెందిన కిశోర్, సుధీర్, సందీప్ మధ్య పాత గొడవలున్నాయి. ఈ నెల 13న చంద్రశేఖర్ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా.. వారు అడ్డుకొని దాడి చేశారు. గాయపడిన ఆయన్ను స్థానికులు ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వర్గాల సమాచారంతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## పోలీసు ఇంట్లో చోరీ

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** నగర శివారు చొదిమెళ్లకు చెందిన కొండేటి సతీశ్ పోలీసు శాఖలో పని చేస్తున్నారు. ఈ నెల 10న ఇంటికి తాళమేసి కుటుంబ సమేతంగా విశాఖపట్నంలో ఉంటున్న సోదరి నూతన గృహ ప్రవేశ వేడుకకు హాజరయ్యారు. 14న తిరిగి ఇంటికి రాగా, తలుపు తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. బీరువాలో దాచిన రెండున్నర కాసుల బంగారు నగలు, కిలో వెండి, నగదు దోచుకెళ్లినట్లు నిర్ధారించుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామీణ ఎస్సై దుర్గాప్రసాద్ మంగళవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే:** తణుకు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని అధికారులు మంగళవారం గుర్తించారు. 34వ వార్డు సచివాలయ రెవెన్యూ కార్యదర్శి లక్ష్మీవెంకట ధానేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పోలవరం

•పోలవరం • చింతలపూడి



## మద్ది ఆంజనేయస్వామికి విశేష పూజలు

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం సందర్భంగా తమలపాకులతో అష్టోత్తర పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ సేవల రూపేణ రూ.1,34,981 సమకూరినట్లు ఆలయ ఈవో ఆర్వీ చందన తెలిపారు.



## నూకాలమ్మ ఆలయంలో..

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని బుట్టాయగూడెం రోడ్డులో కొలువైన నూకాలమ్మ ఆలయంలో మంగళవారం గోపూజ నిర్వహించారు. భక్తులు భారీగా పాల్గొన్నారు. బుధవారం నిర్వహించే చండీ హోమం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలతో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు సంపూర్ణమవుతాయని ఆలయ కమిటీ ఛైర్మన్ రాజాల సత్యనారాయణ తెలిపారు.

## పాపమ్మ కోవెలలో..

**పోలవరం, న్యూస్‌టుడే:** మండలంలోని ఎల్ఎన్డీపేట సమీపంలోని దానవాయి కొండపైన పాపమ్మకు గ్రామస్థులు పూజలు చేశారు. పాల పొంగలి నైవేద్యంగా సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. కూటమి నాయకులు పలువురు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

## మహా రుద్రాభిషేకం, కుంకుమార్చనలు



**టి.నరసాపురం, న్యూస్‌టుడే:** టి.నరసాపురంలో అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో మహా రుద్రాభిషేకం, అమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు. భారీగా భక్తులు పాల్గొన్నారు. ఆలయం వద్ద రెండు నెలల పాటు నిర్వహించే అయ్యప్ప, శివ, భవానీమాలధారులకు భిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## గోదావరికి తగ్గిన వరద

**పోలవరం, న్యూస్‌టుడే:** గోదావరిలో వరద తగ్గుతోంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద మంగళవారం ఉదయం 27.10 మీటర్లుగా ఉన్న నీటిమట్టం సాయంత్రానికి 27కి తగ్గింది. 48 గేట్ల ద్వారా 99.40 వేల క్యూసెక్కులు దిగువకు వెళుతున్నట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు.

## ప్రజల ఆకాంక్ష మేరకు పాలన: ఎమ్మెల్యే

**కొయ్యలగూడెం, న్యూస్‌టుడే:** ఒకేసారి రాష్ట్ర వ్యాప్తంగా రూ.4,500 కోట్లతో సీసీ రహదారుల నిర్మాణ పనులు ప్రారంభించడం చారిత్రక ఘట్టమని, ఇది కూటమి ప్రభుత్వ ఘనత అని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పేర్కొన్నారు. మండలంలోని రామానుజపురం, సీతంపేట, సరిపల్లి, బయ్యనగూడెం, పరింపూడి, గవరవరం గ్రామాల్లో 'పల్లె పండగ' పేరుతో పలు సీసీ రహదారుల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు పారేపల్లి నరేశ్, తోట రవి, డీఆర్డీవో ఎం.రాజు, ఎంపీడీవో కిరణ్, తహసీల్దార్ చెల్లన్నదొర పాల్గొన్నారు.

**పోలవరం, న్యూస్‌టుడే:** పాపికొండల అభయారణ్యంలోని గ్రామాల ప్రజలకు సరైన దారి సదుపాయం లేక అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రం పోలవరానికి 52 కిలోమీటర్ల దూరంలో నివాసం ఉంటున్నారు. గెడ్డపల్లి పంచాయతీ పరిధిలో గిన్నెపల్లి, చిలకలూరు, ధార్వాడ, తంగేడికొండ, చీమలూరు గ్రామాలు ఉన్నాయి. వీరంతా అత్యవసర పనులు, బ్యాంకు లావాదేవీలకు పోలవరం, వారపుసంతకు కన్నాపురం, వైద్యం కోసం పులిరామన్నగూడెంలకు రావాల్సి ఉంది.

**కంగుతిన్న అధికారులు..** గత ప్రభుత్వ హయాంలో చింతపల్లి-గెడ్డపల్లి రహదారి నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించని కారణంగా రద్దు చేశారు. కేంద్ర ప్రభుత్వ అధికారులకు అందిన సర్వే నివేదికలో ఈ రోడ్డు బాగుందని పేర్కొనడంతో ఐటీడీఏ అధికారులు కంగుతిన్నారు.

**వంద జనాభా దాటిన గ్రామాల గుర్తింపు**

పోలవరం, బుట్టాయగూడెం మండలాల్లో వందమందికి పైగా ఉన్న కొండ రెడ్ల గ్రామాలు ఎనిమిదింటిని గుర్తించారు. పోలవరం మండలం గిన్నెపల్లి, వెంకటరెడ్డిగూడెం, చిలకలూరు, గెడ్డపల్లి, బుట్టాయగూడెం మండలం గుమ్ములూరు, నాగన్నగూడెం, వద్రింక, రెడ్డిగూడెం గ్రామాలను గుర్తించి రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదించారు.

# దారి లేక.. మైదానానికి చేరలేక!

☛ అభయారణ్యంలో కొండరెడ్ల అవస్థలు ☛ జన్‌మన్‌లో లేకపోవడంతో నిరుత్సాహం

**పింఛన్ సొమ్ముల కోసం బృందాలుగా..** గత ప్రభుత్వం చివరి రెండు నెలల పింఛన్ల మొత్తాలు బ్యాంకు ఖాతాల్లో జమచేయడంతో ఆటోలను కిరాయికి మాట్లాడుకుని దశల వారీగా పోలవరం స్టేట్‌బ్యాంకుకు వచ్చి వృద్ధులు, వితంతువులు నగదు తీసుకున్నారు. వారి గ్రామాల నుంచి ఉదయం ఏడు గంటలకు బయలుదేరి రాగా తిరిగి ఇంటికి చేరేసరికి చీకటి పడింది.

**రెండో దశలో..** రెండో దశలో పోలవరం మండలం ఉడతపల్లిలో రూ.8 కోట్లతో ఎనిమిదన్నర కిలోమీటర్లు, బుట్టాయగూడెం మండలం వీరన్నపాలెంలో రూ.4కోట్లతో నాలుగు కిలోమీటర్ల పొడవునా తారురోడ్ల నిర్మాణాలకు నివేదించినట్లు స్పెషల్ డివిజన్ ఏఈ అంకిరెడ్డి చెప్పారు. చింతపల్లి, గెడ్డపల్లి రోడ్డు విషయంలో ఏం జరిగిందో తెలియడం లేదన్నారు.



చింతపల్లి నుంచి గెడ్డపల్లి వెళ్లే మార్గం



**మరో మార్గం లేదు..** ప్రధాన మార్గం చింతపల్లి-గెడ్డపల్లి పూర్తిగా దెబ్బతింది. మరో మార్గం లేదు. ఈ కారణంగా అంత దూరం సామగ్రి చేరవేసే పరిస్థితి లేక గుత్తేదారులు చేతులెత్తేయడంతో సచివాలయాల నిర్మాణాలు నిలిచిపోయాయి. విధుల్లో భాగంగా అధికారులు ఏదైనా పనిమీద వెళితే వారికి రెండు రోజులు పాటు ఒళ్లు నొప్పులు తప్పవు. జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా మారుమూల కొండరెడ్డి గిరిజన గ్రామాల ప్రజలకు రోడ్లు, విద్యుత్తు, తాగునీరు, ఇళ్లు, చరవాణి స్తంభాల సదుపాయం కల్పిస్తామని చెప్పడంతో ఆశలు చిగురించాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన జాబితాలో ఈ రోడ్డు లేకపోవడంతో తీవ్ర నిరుత్సాహం కలిగిందని గెడ్డపల్లి సర్పంచి చంద్రు శారద ఆవేదన వ్యక్తం చేశారు.



**జీలుగుమిల్లి, న్యూస్‌టుడే**

**సమస్య:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జీలుగుమిల్లి-వంకవారిగూడెం రహదారిలో కాలువ వద్ద కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో గత నెల రోజులుగా రాకపోకలు నిలిచాయి. ఈ నేపథ్యంలో మూడు కిలోమీటర్లకు గాను చుట్టూ తిరిగి 10కి కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. **-ప్రసాద్, వ్యాపారి, వంకవారిగూడెం**

**సమాధానం:** కల్వర్టు దుస్థితిపై అధికారులకు నివేదిక అందించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. **-వెంకటలక్ష్మి, ఎంపీడీవో**

## పూడిక తొలగింపు

స్పందనకు వందనం

**కామవరపుకోట (జంగారెడ్డిగూడెం), న్యూస్‌టుడే:** కామవరపుకోట వీరభద్ర స్వామి ఆలయానికి వెళ్లే దారిలో మురుగునీటి కాలువలను పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేశారు. 'మురుగు పారదు, పూడిక తొలగదు' శీర్షికన 'ఈనాడు'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి గ్రామ కార్యదర్శి రవినాయక్ స్పందించి.. శుభ్రం చేయించారు.




అవగాహన ప్రదర్శనలో పాల్గొన్న డీవైఈవో రామన్నదొర

## 'అభ్యాస రుగ్మత చిన్నారులకు మద్దతు అవసరం'

**కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** అభ్యాస రుగ్మత (డిస్‌లెక్సియా) కలిగిన చిన్నారులకు తగిన మద్దతు అవసరమని కొయ్యలగూడెం డీవైఈవో ఎం.రామన్నదొర అన్నారు. డిస్‌లెక్సియా వారోత్సవాలను కొయ్యలగూడెంలో మంగళవారం ఆయన ప్రారంభించారు. సమ్మిళిత విద్యలో భాగంగా మండలంలోని ప్రత్యేక విద్యా విభాగం శిక్షకుల ఆధ్వర్యంలో అభ్యాస రుగ్మతకు గల కారణాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి, సుజాత, ప్రత్యేక విద్య శిక్షకులు సరస్వతి, జయలక్ష్మి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మేడేపల్లిలో వైద్య శిబిరం

**వేలేరుపాడు, న్యూస్‌టుడే:** అనారోగ్యంతో ఇద్దరు మృతిచెందిన నేపథ్యంలో వేలేరుపాడు మండలం మేడేపల్లిలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 27 మందికి పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. బాధిత కుటుంబాల వద్ద మృతికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ అగత, నర్సులు, పాల్గొన్నారు.

## డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** మెగా డీఎస్సీకి సన్నద్ధమవుతున్న కేఆర్‌పురం ఐటీడీఏ పరిధి మన్యం మండలాల్లోని గిరిజన అభ్యర్థులకు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఉచిత వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ ఇన్‌ఛార్జి పీవో, జేసీ పి.ధాత్రిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ, డీఎడ్, టెట్ ఉత్తీర్ణులై, కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.50 లక్షల లోపు ఉన్న అభ్యర్థులు జ్ఞానభూమి పోర్టల్‌లో ఈ నెల 21 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆరు దశల పరిశీలన అనంతరం అర్హత పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**చింతలపూడి, న్యూస్‌టుడే:** జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇవ్వనున్నట్లు ఏఎస్‌డబ్ల్యూవో రత్నకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ అర్హత కలిగి, వార్షిక ఆదాయం రూ.2.50లక్షల లోపు ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 21 లోగా జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సందేహాలుంటే చింతలపూడిలోని ఏఎస్‌డబ్ల్యూవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## సస్యరక్షణతో ఆశించిన దిగుబడి

**కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** రామానుజపురం, వేదాంతపురం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. క్షేత్ర పర్యటనలో వేరుశనగ పంటకు ఆకుమచ్చ టిక్కా తెగులు సోకినట్లు గుర్తించిన అధికారులు నివారణా చర్యలను రైతులకు వివరించారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అధికారులతో కలిసి పంటను పరిశీలించారు. రైతులకు తగిన సూచనలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచి అడపా నాగలక్ష్మి, మండల వ్యవసాయాధికారి చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

**వేలేరుపాడు, న్యూస్‌టుడే:** సరైన సస్యరక్షణ చర్యలు పాటిస్తే ఆశించిన దిగుబడులు పొందవచ్చని ఏవో సమీరజ పేర్కొన్నారు. కొయిదాయాదారంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వరి, పత్తి, మినుములో ఎరువులు, నీటి యాజమాన్యం గురించి వివరించారు.

**ప్రకృతి సేద్యంతో నాణ్యమైన దిగుబడి**

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** ప్రకృతి సేద్యం వరిలో నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు సూచించారు. కేఆర్‌పురం, అచ్చియ్యపాలెం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వరి పంటను పరిశీలించి, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల పిచికారీ తగ్గించాలన్నారు.



రామానుజపురంలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న బాలరాజు

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** రైతులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ శ్యామ్‌చంద్ర శేషు అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో వ్యవసాయాధికారి పోశారావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సర్పంచి యడ్లపల్లి రాధిక, ఎంపీటీసీ సభ్యుడు జజ్జవరపు తాతారావు, పోల్నాటి సత్యనారాయణ, తడికల దావీదు, తాళ్లూరు వెంకటేశ్వరరావు, ఎలికే తాతారావు తదితరులు పాల్గొన్నారు.


## కాలువ నిర్మించారు.. అనుసంధానం మరిచారు!



జంగారెడ్డిగూడెం పట్టణంలోని 14వ వార్డు పరిధి గద్దె వారి చెలక రహదారి అధ్వానంగా తయారైంది. ఈ మార్గంలో మురుగు పారే దారి లేక భారీ గొయ్యి ఏర్పడింది. ఆ ప్రాంతంలో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఆ దారిలో ఎన్నికలకు ముందు సుమారు రూ.4 లక్షలతో మురుగు కాలువ నిర్మించారు. కానీ నీరు పారేందుకు అనుసంధానం ఏర్పాటు చేయలేదు. ఈ కారణంగా ఇళ్ల నుంచి పారే వాడకం నీరు కాలువ ద్వారా ప్రధాన రహదారి వరకు చేరి ఆగిపోతోంది. ఫలితంగా దోమలు వ్యాప్తి చెంది పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని పురపాలక కమిషనర్ కేవీ రమణ తెలిపారు.

- న్యూస్‌టుడే, జంగారెడ్డిగూడెం

## అడవి కాదు.. కార్యాలయ దారి!



జాతీయ రహదారి నుంచి జీలుగుమిల్లి వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయానికి వెళ్లే దారి పిచ్చి మొక్కలతో దర్శనమిస్తోంది. కేవలం ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు వీలుండే ఈ మార్గంలో ప్రస్తుతం రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాముల బెడద అధికంగా ఉండటంతో పాటు అటుగా వెళ్లాలంటేనే భయాందోళన చెందుతున్నామని ఉద్యోగులు వాపోతున్నారు. కార్యాలయానికి బరకాలు, ఇతర పరికరాలు తరలించే వాహనం ముందుకు సాగాలంటే అవస్థ పడాల్సిందే.

- న్యూస్‌టుడే, జీలుగుమిల్లి

## నిర్మాణాలు అసంపూర్తి.. సేవలకు సంకట స్థితి!

గత వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవల పేరిట రూ.కోట్లు ఖర్చు చేసి పనులు చేపట్టిన పలు భవనాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అసంపూర్తి పనులు పూర్తి చేయలా లేక వదిలివేయాలో తెలియని సంకట స్థితిలో అధికారులున్నారు. పోలవరం మండలం ఇటుకలకోట, ఎల్ఎన్డీపేట, చేగొండపల్లి పంచాయతీ పరిధిలోని సచివాలయాల నిర్మాణాలు తుది దశకు చేరాయి. ఇటుకలకోట ఆర్బీకే తుది రూపు దిద్దుకుంది.



పోలవరంలో సచివాలయం, ఆర్బీకేల నిర్మాణం

పోలవరం-3లో నిర్మించిన హెల్త్ క్లినిక్ నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ఎల్ఎన్డీపేట, చేగొండపల్లి సచివాలయాల భవనాలకు రంగులు, మిగిలిన పనులు పూర్తి చేస్తే ప్రారంభించే అవకాశం ఉంది. ఆర్బీకే, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం మధ్యలోనే నిలిచింది. ప్రస్తుతం ఆ సచివాలయాల పరిధిలోని సిబ్బంది..కమ్యూనిటీ హాలు, పాత పంచాయతీ భవనాల్లో సేవలు అందిస్తున్నారు. ఐటీడీఏ ఇంజినీరింగ్ డీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ భవనాల పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. అనుమతి వచ్చాక పనులు పూర్తిచేస్తామని చెప్పారు.

- న్యూస్‌టుడే, పోలవరం



## ప్రారంభించినా తెరుచుకోని ఆరోగ్య కేంద్రం

**కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** వైకాపా ప్రభుత్వ హయాంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హడావుడిగా ప్రారంభించిన ఆరోగ్యకేంద్ర భవనం ఎన్నికలు ముగిసి ఆరు నెలలు పూర్తవుతున్నా ఇప్పటికీ తెరుచుకోలేదు. బోడిగూడెం సచివాలయం పరిధిలోని అంకాలగూడెంలో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటరు నిర్మాణాన్ని తొలుత రూ.17లక్షల అంచనాతో చేపట్టారు. ఆ తర్వాత నిధులు చాలడం లేదంటూ మరో రూ.3లక్షలు వెచ్చించారు. ఇంకా తలుపులు, విద్యుద్దీకరణ, మొదలైన పనులు చేయాల్సి ఉంది. ఎన్నికల నిబంధనల అమలు సమయంలో భవనానికి వేసిన రంగు, భవనంపై రాసిన పేరు అప్పటి అధికార పార్టీ రంగులను పోలి ఉండటంతో మార్చారు. నామఫలకాన్ని మరో ముదురురంగుతో చెరిపే ప్రయత్నం చేశారు. ఇప్పటి వరకు ఆ భవనం పనులను పట్టించుకోలేదు. మరోవైపు గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రం నిర్వహిస్తున్న భవనం శిథిలమవడంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. దీనిపై పంచాయతీ రాజ్ ఏఈ సురేశ్ మాట్లాడుతూ భవనం పనులు పూర్తయ్యేందుకు అవసరమైన ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు.


## అల్లుకున్న ప్రమాదం!

**కామవరపుకోట (జంగారెడ్డిగూడెం), న్యూస్‌టుడే:** విద్యుత్తు స్తంభాల నిర్వహణలో ఆ శాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. అధిక విద్యుత్తు ప్రసరించే తీగలున్న వాటి విషయంలోనూ పట్టింపులేనట్లుగా వ్యవహరిస్తున్నారు. మండల కేంద్రం కామవరపుకోట ప్రధాన రహదారిని ఆనుకొని కనకదుర్గమ్మ ఆలయం సమీపంలో 220 కేవీ విద్యుత్తు స్తంభాలకు పాదులు అల్లుకున్నాయి. చెట్ల కొమ్మల్లోనూ అవి కలిసిపోయాయి. భారీ వర్షాలు, ఈదురు గాలులకు తరచూ విద్యుత్తు ప్రమాదాలు జరుగుతున్నాయి. పరిశీలించి వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం ఈఈ రాధాకృష్ణ తెలిపారు.



## అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం

**కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** మాజీ రాష్ట్రపతి ఏపీజే డాక్టర్ అబ్దుల్‌కలాం ఆశయాలు స్ఫూర్తిదాయకమని కుంతలగూడెం ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్వీ రమణ అన్నారు. కలాం జయంతిని పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. జీవిత విశేషాలను వివరించారు. విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.



కుంతలగూడెంలో చిత్రపటం వద్ద నివాళి అర్పించిన విద్యార్థులు

**పోలవరం, న్యూస్‌టుడే:** పోలవరంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక యువకులు పలువురు ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్.సుధీర్, పఠాన్‌ఖాజా, మీసాల రాంబాబు, సున్నం గంగాచలం, కె.సురేశ్, ఎన్.వెంకటేశ్, పి.దుర్గప్రసాద్ పాల్గొన్నారు.




టి.నరసాపురంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

**టి.నరసాపురం, న్యూస్‌టుడే:** మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా, దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు పురం శ్రీనివాస్ అన్నారు. అబ్దుల్ కలాం జయంతిని టి.నరసాపురంలో నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మద్యం విక్రేతల అరెస్టు

**కుక్కునూరు, న్యూస్‌టుడే:** తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్న సీతారామనగరానికి చెందిన వ్యాపారి అంజనరావు, వాటిని విక్రయిస్తున్న బోనగిరికి చెందిన ధనలక్ష్మిని కుక్కునూరు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. బోనగిరి గ్రామంలో రెండ్రోజుల కిందట నిర్వహించిన సోదాల్లో వారు పట్టుబడినట్లు సీఐ రమేశ్‌కుమార్ తెలిపారు.

## కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**కుక్కునూరు, న్యూస్‌టుడే:** నిత్యం ప్రమాదాల అంచున జీవనం సాగిస్తున్న రవాణా రంగ కార్మికులకు సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు కోరారు. కుక్కునూరులో మంగళవారం నిర్వహించిన లారీ డ్రైవర్లు, క్లీనర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం పెంచిన త్రైమాసిక రహదారి పన్నులను తగ్గించాలని డిమాండ్ చేశారు. రవాణా రంగం నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.వేల కోట్ల ఆదాయం ఆర్జిస్తున్న ప్రభుత్వాలు, కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేశాయని విమర్శించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని లారీలకు ఇసుక రవాణా చేసే అవకాశాలు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాగలక్ష్మి, సాయికిరణ్, మడివి దుర్గారావు, నాగేంద్రరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కుక్కునూరులో మాట్లాడుతున్న లింగరాజు

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** భవన నిర్మాణ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. పట్టణంలోని ధర్మన్న స్మారక భవనంలో ఐఎఫ్‌టీయూ సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 18న విజయవాడలో నిర్వహించే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలన్నారు. అనంతరం సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ధర్మరాజు, తీగల గణేశ్, కోట శివకృష్ణ, నవీన్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా నాయకుడికి తీవ్ర గాయాలు


**చింతలపూడి, న్యూస్‌టుడే:** ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో తెదేపా చింతలపూడి పట్టణ అధ్యక్షుడు పక్కాల వెంకటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. కొవ్వూరుగూడెంలో తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనేందుకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా.. ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు బలంగా ఢీకొట్టడంతో వెంకటేశ్వరరావు తలకు బలమైన గాయాలయ్యాయి. తొలుత ఆయన్ని స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఏలూరు తరలించినట్లు నాయకులు తెలిపారు.

### లారీ, వ్యాను ఢీకొని ఇద్దరికి..

**కొయ్యలగూడెం, న్యూస్‌టుడే:** లారీ, వ్యాను ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఆయా వాహనాల డ్రైవర్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నరసన్నపాలెం వద్ద సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ప్రమాదంలో రెండు వాహనాల ముందు భాగాలు నుజ్జునుజ్జు కావడంతో ఇరుక్కున్న వారిని బయటకు తీసేందుకు చాలా సమయం పట్టింది. క్షతగాత్రులైన డ్రైవర్లను రాజమహేంద్రవరం తరలించారు. రహదారిపై పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోవడంతో ఎస్సై వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దాదాపు మూడు గంటలు పాటు శ్రమించి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

**జిల్లా కన్వీనర్‌గా సుబ్రహ్మణ్యం**

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** తిరుమల తిరుపతి అన్నమయ్య జానపద కళాక్షేత్రం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కన్వీనర్‌గా ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడుకు చెందిన కారుమంచి సుబ్రహ్మణ్యంను నియమించినట్లు సకల కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దువ్వి రామారావు తెలిపారు.



నూజివీడు
• నూజివీడు • కైకలూరు

## అన్ని వసతులు కల్పించాలి: న్యాయమూర్తి


వసతి గృహాన్ని పరిశీలిస్తున్న లక్ష్మి

**కైకలూరు, న్యూస్‌టుడే:** విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి, ఆరోగ్యకరంగా ఉండే భోజనం అందించాలని కైకలూరు సివిల్ కోర్టు సీనియర్ న్యాయమూర్తి వీవీఎన్‌వీ లక్ష్మి అన్నారు. మండలంలోని ఆటపాక సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల సంఖ్య, భోజనం మెనూ, పడక మంచాలు, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. న్యాయవాదులు దేవరపల్లి శివప్రసాద్, ప్రసన్నకుమార్, కోర్టు సిబ్బంది దుర్గాభవాని, వసతిగృహ సంక్షేమాధికారిణి ఎన్.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థినులతో ఉపాధ్యాయులు

**నూజివీడు పట్టణం న్యూస్‌టుడే:** నూజివీడు మండలం గొల్లపల్లిలో అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయిని రాధిక రాణి మంగళవారం తెలిపారు. మంగళవారం నున్న జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్ 17 బాలికల ఎంపికలో తొమ్మిదో తరగతి విద్యార్థినులు మేఘన, జయశ్రీ, అనూష ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరు నంద్యాలలో ఈ నెల 20న జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయులు అభినందించారు.



కైకలూరు, న్యూస్‌టుడే

**సమస్య:** మండలంలోని ఆటపాక ఎఫ్‌సీఐ గోదాముల ఎదురుగా ప్రధాన రహదారి వెంబడి చెత్త, వ్యర్థాలు పడేస్తున్నారు. ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. **- చైతన్యకృష్ణ, ఆటపాక**

**సమాధానం:** వెంటనే చెత్త, వ్యర్థాలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- రవికిరణ్, పంచాయతీ కార్యదర్శి**

# జాతీయ రహదారి.. ప్రమాదకరంగా మారి

### అసంపూర్తిగా విస్తరణ పనులు

**కైకలూరు, న్యూస్‌టుడే**

పామర్రు నుంచి కైకలూరు, ఉండి, భీమవరం నియోజకవర్గాల మీదుగా దిగమర్రు చేరుకునే 165 జాతీయ రహదారిలో ప్రయాణాలు సాగిస్తే ప్రాణాలకు ఏ మాత్రం భరోసా లేదు. నరకానికి నకళ్లుగా మారిన ఈ మార్గంలో ప్రయాణమంటేనే మూడు జిల్లాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఈ రోడ్డు విస్తరణ పనులు ముదినేపల్లి మండలంలో కొంత ఆశాజనకంగా సాగినా.. కైకలూరు మండలం ఆలపాడు వద్ద పై వంతెన నిర్మాణం పూర్తి చేయడం, అక్కడక్కడా అరకొర పనులు తప్ప గడిచిన రెండేళ్లల్లో పూర్తిస్థాయి పనులు నిర్వహించిన దాఖలాలు లేవు.


నిలిచిన పై వంతెన నిర్మాణం

### హడలిపోతున్న చోదకులు

అసంపూర్తి పనులతో సింగాపురం నుంచి సోమేశ్వరం వరకు 10 కి.మీ. ప్రయాణమంటే వాహనదారులు హడలిపోతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న వారు సైతం గతుకుల ధాటికి వెన్నుపూసలు కదిలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక సింగాపురం, వదర్లపాడు బ్రాంచి భుజబలపట్నంలో రోడ్డుకు ఇరువైపులా భారీ గుంతలు తవ్వి వదిలేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు అవి కాలువలను తలపిస్తున్నాయి. ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం పదుల సంఖ్యలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రి వేళల్లో ప్రమాదకర పరిస్థితుల్లో భీమవరం, ఏలూరు, గుడివాడ వైపు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇక ఆటపాక వద్ద పుల్లవా డ్రెయిన్‌లో నిర్మాణం చేపట్టిన పైవంతెన సైతం అసంపూర్తిగానే దర్శనమిస్తోంది.


భుజబలపట్నంలో రోడ్డు దుస్థితి

### అనుకూలంగా ఉన్నా... సాగని పనులు

సాధారణంగా రోడ్డు విస్తరణ పనులు నిర్వహిస్తే స్థల సేకరణకు ఆటంకాలు వస్తుంటాయి. అయితే ఇక్కడ పరిస్థితి పూర్తి విరుద్ధం. స్థల సేకరణ పూర్తయి ఏళ్లు గడుస్తున్నా పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. కైకలూరు మండలం సింగాపురం శివారు నుంచి ఆలపాడు ప్రారంభం వరకు ప్రభుత్వ భూమి ఉన్నా పనులు మందగించాయి. సుమారు 5 నెలల కిందట రోడ్డు తవ్వి సక్రమంగా పూడిక చేయకుండా వదిలేసినా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడలేదు.

### ఎప్పుడు ప్రారంభిస్తారో మరి

ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణాజిల్లాల ప్రజలకు ప్రధాన మార్గమైన 165 జాతీయ రహదారి పనులు పూర్తిస్థాయిలో ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియకుండా ఉంది.

'పామర్రు- దిగమర్రు రహదారి విస్తరణలో భాగంగా కైకలూరు ప్రాంతంలో పనులను వారం రోజుల్లో ప్రారంభించేలా చర్యలు చేపడతున్నాం. సింగాపురం నుంచి సోమేశ్వరం వరకు డిసెంబరు ఆఖరు నాటికి ప్రధాన రోడ్డు మార్గం పనులు పూర్తి చేసేలా చూస్తాం. గుంతలు ఉన్న చోట రేడియం సూచికలు ఏర్పాటు చేస్తాం.' అని ఎన్‌హెచ్‌ఏఐ డీఈఈ సత్యనారాయణ తెలిపారు.



అలంకరణలో స్వామి | చాలీసా పారాయణం చేస్తున్న మహిళలు

## ఆంజనేయునికి పూజలు

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** స్థానిక పెదరామాలయంలోని ఆంజనేయస్వామికి మంగళవారం పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామివారిని వివిధ పండ్లు, గారెలతో అలంకరించారు. మహిళలు సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

## సుందరయ్య భవనంలో రైతు సదస్సు


పాల్గొన్న రైతులు

**నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే:** మొక్కజొన్న రైతులకు విత్తన కంపెనీల నుంచి అగ్రిమెంట్స్ ఇప్పించాలని, చింతపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తి చేసి సాగునీరు అందించాలని రైతు సదస్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం నూజివీడు పట్టణంలోని సుందరయ్య భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఘంటా పాపారావు అధ్యక్షతన ప్రాంతీయ రైతు సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు.

## ఏజెంట్ల విషయంలో నిర్లక్ష్యం తగదు

**నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే:** నూజివీడు ఎల్ఐసీ కార్యాలయం వద్ద లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన నిర్వహించారు. పాలసీలపై జీఎస్టీ రద్దు చేసి, బోనస్‌లు, ఏజెంట్ కమిషన్ పెంచాలని నినాదాలు చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మేనేజర్‌కు అందించారు. ఈ సందర్భంగా పలువురు ఏజెంట్స్ మాట్లాడుతూ తమపై సంస్థ నిర్లక్ష్య వైఖరి తగదన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, జి.మల్లికుమార్, సుబ్బారావు, కోటేశ్వరావు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## వైకాపా పాలనలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం: మంత్రి

**ముసునూరు, నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే:** అభివృద్ధికి పునాదిగా నిలిచే గ్రామ పంచాయతీ వ్యవస్థను గత అయిదేళ్లలో వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మంత్రి కొలుసు పార్థసారథి ఆరోపించారు. అన్ని స్థాయిలలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. మంగళవారం ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెం, సూరేపల్లి, లోపూడి, చెక్కపల్లి గ్రామాల్లో రూ.82.25 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఆరుబయట అరుగు మీద కూర్చొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచి లక్ష్మీసత్యనారాయణ, తల్లిబోయిన రాధిక, సత్యనారాయణ, బర్మా ఫణిబాబు, శ్రీనివాసరావు, మానురాజు సురేశ్, చల్లగుళ్ల మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చెక్కపల్లిలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తాగునీరు, డ్రైనేయిజీ, రోడ్ల సమస్యలను ప్రజలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.


అక్కిరెడ్డిగూడెంలో మాట్లాడుతున్న పార్థసారథి

★ మంత్రి పార్థసారథి పనితీరును అభినందిస్తూ నూజివీడులోని పార్టీ కార్యాలయంలో సీనియర్ తెదేపా నాయకుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి కుర్రా నరేంద్ర తదితరులు ఆయనకు పూలమొక్క అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మూల్పూరి లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

## మండవల్లిలో ఆక్రమణల తొలగింపు



**మండవల్లి, న్యూస్‌టుడే:** మండవల్లి మంచినీటి చెరువు గట్టు ప్రాంతంలో ఆక్రమణలను పంచాయతీ అధికారులు మంగళవారం తొలగించారు. జాతీయ రహదారి పక్కన మంచినీటి చెరువు ప్రాంతంలో ఖాళీ ప్రభుత్వ భూమి ఆక్రమించడంపై సోమవారం 'ఖాళీ జాగా వేసెయ్ పాగా' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై ఇన్‌ఛార్జి ఎంపీడీవో రామలింగేశ్వరరావు స్పందించి వెంటనే ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కార్యదర్శి కొండలను ఆదేశించారు. మండవల్లి సర్పంచి మెండా ఝాన్సీ ఆధ్వర్యంలో అధికారులు ఆక్రమణలు తొలగించారు.

### వడాలిలో..

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** వడాలిలో ప్రధాన రహదారి వెంబడి ఇరువైపులా డ్రెయిన్లపై ఉన్న ఆక్రమణలను అధికారులు మంగళవారం తొలగించారు. వాటిని సోమవారంలోపు తొలగించాలని సుమారు 30 మందికి నోటీసులు ఇచ్చారు. దీంతో కొంతమంది స్వచ్ఛందంగా తొలగించారు. మిగిలినవాటిని పంచాయతీ ఆధ్వర్యంలో పొక్లెయిన్‌తో తొలగించారు. పంచాయతీ కార్యదర్శి యార్లగడ్డ శ్యామ్, వీఆర్వో పద్మ, పోలీసు సిబ్బంది సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు.



## వరద బాధితులకు చేయూత

**ముసునూరు, న్యూస్‌టుడే:** ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెంలో శిర్డీ సాయిబాబా ఆలయాన్ని మంత్రి కొలుసు పార్థసారథి దర్శించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ పి.నరసింహారావు మంత్రిని శాలువాతో సత్కరించారు. అనంతరం విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఛైర్మన్‌ను అభినందించారు.

## గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయం

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** గ్రామాల సర్వతోముఖాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. పల్లెపండుగలో భాగంగా గురజ, ముదినేపల్లి, కోడూరు, పెదపాలపర్రు, వడాలి గ్రామాల్లో ఉపాధిహామీ పథకం నిధులతో సీసీ రహదారుల నిర్మాణానికి మంగళవారం ఆయన భూమిపూజ నిర్వహించారు. వైకాపా ప్రభుత్వం పల్లెల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందన్నారు. పర్యాటక అభివృద్ధి శాఖ డైరెక్టర్ కొడాలి వినోద్, తెదేపా నాయకులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, బొర్రా చలమయ్య, కోడూరు శేషుబాబు, సర్పంచులు నిమ్మగడ్డ కైకమ్మ, పరసా విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ముదినేపల్లిలో నిర్వహిస్తున్న భూమి పూజ

సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో కామినేని.. **ముదినేపల్లి, న్యూస్‌టుడే:** సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటరులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో ఏసీ ఆర్.గంగాశ్రీదేవి స్వాగతం పలికారు. అనంతరం పుట్టలో పాలుపోసి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని, శేష వస్త్రాన్ని ఏసీ అందించారు.


అర్జీదారుడితో మాట్లాడుతున్న ఆర్డీవో వాణి

## సకాలంలో సమస్యలు పరిష్కరించండి

**నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీకోసం'లో ప్రజల నుంచి వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆర్డీవో ఎం.వాణి ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం మీకోసం కార్యక్రమంలో రెండు అర్జీలు వచ్చాయని ఆర్డీవో తెలిపారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు పెంచాలి.. **మండవల్లి, న్యూస్‌టుడే:** పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను పెంచాలంటూ సామాజిక కార్యకర్త భాస్కరరావు, అప్పారావు తదితరులు సోమవారం 'మీ కోసం'లో ఇన్‌ఛార్జి తహసీల్దార్ గోపాల్, ఈవోపీఆర్డీ శేఖర్‌కు వినతిపత్రం అందించారు.

## అభ్యాసన వైకల్యంపై అవగాహన

**ముసునూరు, న్యూస్‌టుడే:** ముసునూరు మండలం రమణక్కపేట భవిత కేంద్రంలో మంగళవారం ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు, ప్రధానోపాధ్యాయుడు పసుమర్తి రామకృష్ణ ఆధ్వర్యంలో డిస్లెక్సియాపై(అభ్యాసన వైకల్యం) అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారి అభ్యాసన వైఫల్యాలను ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్దవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం లోకరాజు, ఐఈఆర్టీలు డీఎంవీ లక్ష్మీనారాయణ, జె.నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** ముదినేపల్లి భవిత సెంటరు ఆధ్వర్యంలో మంగళవారం అభ్యాసన వైకల్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముదినేపల్లి సముదాయ ఛైర్మన్ వై.విజయ్‌కుమార్, ఐఈఆర్టీ ఉపాధ్యాయులు యు.మోహన్ ఫణికుమారి, బి.నీలిమా, విద్యార్థులు పాల్గొన్నారు.

### సినిమాలు

**నూజివీడు పట్టణం**

| | |
|---|---|
| సత్యనారాయణ | దేవర |
| సత్యనారాయణ మినీ | జనక అయితే గనక |
| ద్వారక సినిమాస్ స్క్రీన్ 1 | మార్టిన్ |
| ద్వారక సినిమాస్ స్క్రీన్ 2 | విశ్వం |
| ద్వారక సినిమాస్ స్క్రీన్3 | వేట్టయన్ |
| **ఆగిరిపల్లి:** శ్రీఅను డీలక్స్ | దేవర |
| **కైకలూరు** | |
| విజయలక్ష్మి జీ3 సినిమాస్ | దేవర |
| మాగంటి సినిమాస్ | వేట్టయన్ |
| శ్రీవెంకటరమణ సినిమాస్ | విశ్వం |
| **ముదినేపల్లి:** పూర్ణిమ | దేవర |

## ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలాం

**కైకలూరు, ముసునూరు, న్యూస్‌టుడే:** శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి చిరస్మరణీయమైన సేవలు అందించిన ఏపీజే అబ్దుల్ కలాం ఆదర్శప్రాయుడని తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పూల రామచంద్రరావు అన్నారు. కలాం జయంతిని పురస్కరించుకుని తెదేపా పట్టణ అధ్యక్షుడు ఎండీ జానీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలోని ఆయన విగ్రహానికి తెదేపా శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేకు కోసి మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో సయ్యద్ బాషీద్, ఎండీ ఉస్మాన్, గఫూర్ వేములపల్లి కారుణ్య తదితరులు పాల్గొన్నారు. ★ ముసునూరు మండలం రమణక్కపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.


కైకలూరు: విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


రమణక్కపేటలో..

## దాతల సహకారం అవసరం

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నవారికి చేయూత అందించడానికి దాతల సహకారం అవసరమని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయ రామరాజు అన్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో మంగళవారం సంఘ సేవకురాలు మొవ్వ శారద, ఆమె భర్త కొత్త రవీంద్రబాబు జ్ఞాపకార్థం సమకూర్చిన సొమ్ములతో నలుగురు బాలలకు కృత్రిమ కాళ్లను అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ వి.ఎన్.మస్తానయ్య, హీల్ కార్యదర్శి టి.లక్ష్మి, సీఈవో అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కృత్రిమ కాళ్లు అమర్చిన వారితో విజయ రామరాజు, హీల్ ప్రతినిధులు

## గ్రామీణ ప్రగతే లక్ష్యం

**తాడినాడ (కలిదిండి), న్యూస్‌టుడే:** రహదారులు గ్రామాల అభివృద్ధికి సూచికలు అని కూటమి నేతలు పోకల జోగింరాజు, వల్లభనేని నాని, కొత్తపల్లి బంగారాజు పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వెంకటాపురం, తాడినాడ గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. సర్పంచులు గూడవల్లి శ్రీనివాసరావు, తాడి శ్రీనివాసరావు, కురెళ్ల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** రహదారిపై గేదెలను తప్పించబోయి ప్రమాదవశాత్తు కిందపడటంతో గాయపడిన ఓ మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన ఘటన ఆగిరిపల్లి మండలం ఈదరలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఆగిరిపల్లి మండలం ఈదరకు చెందిన దొండపాటి రాజామణి (55) ఈ నెల 9న సగ్గూరులోని కుమార్తె ఇంటికెళ్లారు. ఆమె తిరిగి ఈ నెల 12న వరుసకు బావ అయ్యే దొండపాటి సుబ్బారావు ద్విచక్ర వాహనంపై ఈదర వస్తున్నారు. ఆగిరిపల్లి- శోభనాపురం గ్రామాల మధ్యలో రహదారిపైకి గేదెలు అడ్డుగా రావడంతో ప్రమాదవశాత్తు వాహనం అదుపుతప్పి ఇద్దరూ కింద పడిపోయారు. తొలుత క్షతగాత్రులను నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం రాజామణిని మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు ఉండగా.. వారిలో ఒకరైన పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

### అవి ఇవి అన్నీ

మండల సర్వసభ్య సమావేశం నేడు.. **ముసునూరు, న్యూస్‌టుడే:** ముసునూరు మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కొండా దుర్గాభవానీ అధ్యక్షతన బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.రాణి మంగళవారం తెలిపారు.

ఓటరుగా నమోదు చేసుకోండి.. **ముదినేపల్లి, న్యూస్‌టుడే:** ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ముదినేపల్లిలో మంగళవారం పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా నాయకులు బేతాళ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆధార్, ఓటరు కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో సంఘ మండల కార్యవర్గాన్ని సంప్రదించి ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమాచార హక్కు చట్టంతో ప్రజలకు మేలు.. **ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** సమాచార హక్కు చట్టంతో ప్రజలకు మేలు జరుగుతోందని తహసీల్దారు పీఎన్వీ ప్రసాద్ తెలిపారు. సమాచార హక్కు చట్టం-2005 వారోత్సవాలను పురస్కరించుకుని ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యంకి సురేశ్ బాబు ఆధ్వర్యంలో రూపొందించిన సమాచార హక్కు చట్టం గోడప్రతిని తహసీల్దారు మంగళవారం విడుదల చేశారు. ఏపీవో మీనాక్షి, ఉప తహసీల్దారు పవన్ కుమార్, సంస్థ ప్రతినిధులు సయ్యద్ లాల్, ఎంకోజి పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యకర జీవనం.. **ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యకరమైన జీవనం సాధ్యపడుతుందని ఆగిరిపల్లి ఏపీఎం దయాల రాజశేఖర్ తెలిపారు. ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆగిరిపల్లి మండలంలో అన్ని గ్రామ, మండల సమాఖ్యలలో మహిళలకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీవో మీనాక్షి, వీవోఏలు, సీసీలు పాల్గొన్నారు.

సకాలంలో జీతాలు చెల్లించాలి.. **మండవల్లి, న్యూస్‌టుడే:** మండవల్లి మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న గుమస్తాలు నూతనంగా విధుల్లో చేరిన ఈవోపీఆర్డీ శేఖర్‌ను మంగళవారం కలిసి పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ప్రతి నెలా పంచాయతీలు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ జీతాల బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందులో సిబ్బంది జగదీష్, రత్నాకర్, చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు..

పాడి రైతుల లాభాలే లక్ష్యం.. **చాట్రాయి, న్యూస్‌టుడే:** పాడి రైతులకు లాభాలను అందించాలనే లక్ష్యంతో జిల్లా పాల సమితి పని చేస్తోందని జిల్లా డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు తెలిపారు. చీపురుగూడెంలో సంఘ సభ్యురాలు కుమార్తె వివాహం పురస్కరించుకుని మంగళవారం ఆయన బంగారు నాణెం అందించారు. తెదేపా నాయకులు మందలపు జగదీష్, సంఘ కార్యదర్శి పాపోతు రాంబాబు రైతులు పాల్గొన్నారు.

# పల్లెల్లో ఉపాధి బాటలు

### ప్రజలకు తీరనున్న దారి కష్టాలు

**చాట్రాయి, న్యూస్‌టుడే:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ నిధులతో గ్రామాలు కొత్త రూపు సంతరించుకోనున్నాయి. వైకాపా ప్రభుత్వం అయిదేళ్ల పాలనలో ఉపాధిహామీ పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించలేదు. దీంతో పనుల్లేక కూలీలు, నిర్మాణరంగ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం నిధులను భారీగా కేటాయించింది. పని కావాల్సిన వారందరికీ పనులు చూపేలా అధికారులు రూపకల్పన చేశారు. వీటిలో రహదారుల అభివృద్ధికి తొలి ప్రాధాన్యత ఇచ్చారు. ఫలితంగా అనేక మట్టిరోడ్లు సిమెంటు రోడ్లుగా మారనున్నాయి.


చనుబండలో సిమెంటు రోడ్డుగా మారనున్న మట్టి మార్గం

| మండలం | పనులు | మీటర్లలో | నిధులు (రూ.లక్షల్లో) |
|---|---|---|---|
| ఆగిరిపల్లి | 52 | 7883 | 466.07 |
| చాట్రాయి | 30 | 5125 | 278.80 |
| ముసునూరు | 59 | 6691 | 318.25 |
| నూజివీడు | 51 | 6691 | 339.00 |
| మొత్తం | 192 | 25,982 | 1392.12 |

### కార్మికులకు భరోసా

గత వైకాపా పాలనలో భవన నిర్మాణ కార్మికులు ఇసుక కొరతతో పనుల్లేక బతుకుదెరువు కోసం నానా పాట్లు పడ్డారు. తాజాగా కూటమి ప్రభుత్వం కార్మికుల బతుకులకు 'భరోసా' కల్పించింది. భవన నిర్మాణ రంగంలో పని చేసే వేలాది మందికి పని గ్యారంటీ లభించనుంది. ఈ నెల 20 తర్వాత పనులు ప్రారంభించేలా పల్లె పండుగలో శంకు స్థాపనలు చేస్తున్నారు.

### మహర్దశ

నూజివీడు నియోజకవర్గంలో ఆగిరిపల్లి, చాట్రాయి, ముసునూరు, నూజివీడు మండలాల్లో 192 మట్టి రోడ్లను సిమెంటు రహదారులుగా మార్చేందుకు అనుమతి ఇచ్చారు. 25.982 కిలో మీటర్ల మేర సిమెంటు రోడ్లు నిర్మించనున్నారు. వీటికి రూ.13.92 కోట్లు కేటాయించారు. పనులను 'పల్లె పండుగ' పేరుతో ప్రారంభించి 'సంక్రాంతి' నాటికి పూర్తి చేయాలనే లక్ష్యం విధించారు.